



Truth of News

PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com



అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 28 | ఆదివారం 06 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# నేపాల్‌లో మృతులు 1,344

- ఇంకా 5,000 మంది గల్లంతు
- 60 ఏళ్ల వృద్ధురాలిని రక్షించిన ఏపీఎఫ్
- కొనసాగుతున్న సహాయక చర్యలు



కాఠ్మాండూ– సూర్యవాస్తవం

నేపాల్‌లో సంభవించిన భారీ ఆకస్మిక వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య శనివారం నాటికి 1,344కు పెరిగింది. ప్రభావిత ప్రాంతాల నుంచి మరిన్ని మృతదేహాలను వెలికితీసినట్లు నేపాల్ పోలీసులు తెలిపారు. కనీసం 589 మంది విదేశీయులతో సహా సుమారు 5,000 మంది ఆచూకీ ఇంకా తెలియరాలేదని, వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. అదే సమయంలో, 13,100 మందికి పైగా ప్రజలను సురక్షితంగా రక్షించామని తెలిపారు. బురద, శిథిలాల కింద చిక్కుకుపోయిన ప్రాణంతో ఉన్న 60 ఏళ్ల వృద్ధురాలిని కాపాడారు. నేపాల్‌లోని నువాకోట్ జిల్లా బిదుర్ పట్టణంలో, వరదల సమయంలో బురద, శిథిలాల కింద చిక్కుకుపోయి నాలుగు అంతస్తుల భవనం పై అంతస్తులో 10 రోజుల పాటు ఉండిపోయిన ఆమెను సజీవంగా బయటకు తీశారు. విపత్తు తర్వాత ఆమె ఆచూకీ లభించకపోవడంతో, ఆమె చనిపోయిందని భావించిన కుటుంబ సభ్యులు అప్పటికే ఆమెకు ప్రతీకాత్మక అంత్యక్రియలు నిర్వహించారు.

చండికా శ్రేష్ఠ అనే ఆ మహిళ అపస్మారక స్థితిలో ఉండగా ఆరమ్డ్ పోలీస్ ఫోర్స్ (ఏపీఎఫ్) బృందం గుర్తించింది. చికిత్స కోసం ఆమెను త్రిశూలిలోని నేపాలీ ఆర్మీకి చెందిన మైథిలి బ్యారక్స్‌కు తరలించారు. ఆగస్టు 26న నేపాల్– ఆకస్మిక వరదలు ముంచెత్తిన విషయం తెలిసిందే. చైనా మీడియా నివేదికల ప్రకారం.. ఈ విపత్తు కారణంగా చైనా వైపు కూడా 21 మంది మరణించారు. టిబెట్‌లో 500 మందికి పైగా గల్లంతయ్యారు.

నేపాల్‌లో ఇప్పటివరకు వెలికితీసిన మొత్తం మృతదేహాలలో 758 మంది పెద్దలు, 85 మంది పిల్లలవి ఉన్నాయి. అన్ని జిల్లాలలోకెల్లా అత్యధికంగా ఒక్క చిత్వాన్‌లోనే 360 మృతదేహాలు లభ్యమయ్యాయి. మిగిలినవి నవల్పరాసి తూర్పు, నవల్పరాసి పశ్చిమ, నువాకోట్, రసువా, గోర్ఖా, ధాడింగ్, తనాహున్ జిల్లాలకు చెందినవని నేపాల్ జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు మరియు నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఆర్ఆర్ఎంఏ) తెలిపింది. ఇప్పటివరకు 98 మృతదేహాలను మాత్రమే కుటుంబాలకు అప్పగించినట్లు

- మిగతా 2లో..



## విద్యార్థుల్లో సృజన నింపాలి

- వారి వ్యసనాలు, మాదకద్రవ్యాలు, అధిక స్క్రీన్ సమయంపై అప్రమత్తంగా ఉండాలి
- వారి ఆసక్తిని ఆవిష్కరణల వైపు మళ్లించాలి
- చదువుతోపాటు క్రీడలు కూడా కీలకమే..
- పిల్లల దైనందిన జీవితాలపై కూడా శ్రద్ధ వహించాలి
- విద్యార్థులను తరగతి గదికే పరిమితం చేయవద్దు
- ప్రతి చిన్నారిలో టాలెంట్‌ను గ్రహించి ప్రోత్సహించాలి
- బాల్యాన్ని పరిరక్షించాలి.. పిల్లల్లో సహజ ఉత్సుకతను పెంపొందించాలి
- ఉపాధ్యాయులను కోరిన ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ– సూర్యవాస్తవం

విద్యార్థులలో మాదకద్రవ్యాల వ్యసనం పట్ల అప్రమత్తంగా ఉండాలని, క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యకలాపాల ద్వారా పిల్లలు అధిక స్క్రీన్ సమయాన్ని ఎదుర్కోవడంలో సహాయపడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉపాధ్యాయులను కోరారు. వీరిని సృజనాత్మక ఆవిష్కరణల

- మిగతా 2లో..



## సుభాష్ చంద్రపై సీబీఐ కేసు

- 1,322 కోట్ల మోసంపై ఎల్ఐసీహెచ్ఎఫ్ఎల్ ఫిర్యాదు
- 22వేల కోట్లకు 6.5 కోట్ల సెటిల్‌మెంట్‌తో వివాదం
- మరో ముగ్గురిపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు
- ఆస్తులు ఎక్కువ చూపి రుణాలు తీసుకున్నారని ఆరోపణ

న్యూఢిల్లీ– సూర్యవాస్తవం

'మీడియా దిగ్గజం సుభాష్ చంద్ర లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్) నుంచి రుణాలు పొందేందుకు తన నికర ఆస్తిని పెంచి చూపారు. ఆ తర్వాత రుణ ఎగవేతదారుగా మారారు. దీనివల్ల ఆ ప్రభుత్వ రంగ సంస్థ కు రూ.1,322 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది' అని ఆరోపిస్తూ సీబీఐ ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని అధికారులు శనివారం తెలిపారు. సుభాష్ చంద్ర తోపాటు పంకజ్ సురోలియా, అమిష్ పాండ్యా, రాజీవ్ ధోలకియాలపై కూడా సీబీఐ కేసు నమోదు చేసింది. ప్రస్తుతం ఎఫ్ఐఆర్‌లో భాగంగా ఉన్న తన ఫిర్యాదులో, మొత్తం రూ.980 కోట్ల విలువైన రెండు రుణాల ఆమోదంతోపాటు పంపిణీని పొందేందుకు ఉపయోగపడిన నికర ఆస్తి ధ్రువీకరణ పత్రాలను సుభాష్‌చంద్ర

- మిగతా 2లో..

# అడిషనల్ క్వాంటం పెన్షన్ పునరుద్ధరణ..

- పెన్షనర్లకు చంద్రబాబు భారీ ఊరట..
- ఉద్యోగులకు కీలక హామీలు
- గత ప్రభుత్వం రద్దు చేసిన అడిషనల్ క్వాంటం పెన్షన్ పునరుద్ధరణ
- 12వ పీఆర్సీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం
- పెండింగులో ఉన్న రెండు డీఏల విడుదలకు గ్రీన్ సిగ్నల్
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం వెల్లడి
- ప్రభుత్వ నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘాల నేతలు



అమరావతి– సూర్య వాస్తవం

రాష్ట్రంలోని రిటైర్డ్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు భారీ ఊరట కల్పించారు. గత ప్రభుత్వం రద్దు చేసిన 'అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్'ను పునరుద్ధరిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగ సంఘాలతో శనివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. దీనితో పాటు ఉద్యోగులు ఎదురుచూస్తున్న పలు పెండింగ్ సమస్యల పరిష్కారానికి కూడా ముఖ్య మంత్రి సానుకూలత వ్యక్తం చేశారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నేతలతో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తూనే, ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.

వచ్చే ఏడాది జనవరి నుంచి పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం, 70 ఏళ్లు దాటిన పెన్షనర్లకు 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు పెన్షన్ అందనుంది. ఉద్యోగుల

- మిగతా 2లో..

# రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

- సీఎం రేవంత్ రెడ్డి
- పేదలు, రైతులు, మహిళల అభ్యున్నతే మా ప్రభుత్వ ధ్యేయం
- ప్రజా పాలనలో అగ్రపీఠం
- రైతు సంక్షేమం
- సూర్యచంద్రులు ఉన్నంత కాలం మహిళా ఉచిత బస్సు ప్రయాణం
- అర్హులందరికీ వివక్ష లేని సంక్షేమ ఫలాలు
- నకిరేకల్ నియోజకవర్గంలో రూ. వందల కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన




నకిరేకల్ – సూర్య వాస్తవం

రాజకీయాలకు అతీతంగా, రాష్ట్రంలో ఎవరి పట్ల ఎలాంటి వివక్ష చూపకుండా అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా పాలన పూర్తిగా పేదలు, రైతులు, మహిళలు, నిరుద్యోగుల అభ్యున్నతి కోసమే పనిచేస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో రూ. 32 కోట్ల భారీ వ్యయంతో అత్యాధునిక హంగులతో నిర్మించిన 100 పడకల నూతన ప్రాంతీయ ఆసుపత్రిని ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం నకిరేకల్ రాజీవ్ గాంధీ మినీ స్టేడియంలో ఘనంగా నిర్వహించిన 'వెయ్యి రోజుల ప్రజా పాలన' బహిరంగ సభలో ఆయన

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## భరద్వాజ్‌పై హత్యాయత్నం కేసు నమోదు

- పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్ ఎదుట సీజేపీ ఆందోళన
- దిగొచ్చిన పోలీసులు..72 గంటల్లో అరెస్టు చేస్తామని హామీ



న్యూఢిల్లీ– సూర్య వాస్తవం

జంతర్‌మంతర్ వద్ద జులై 23న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన ఆందోళన సందర్భంగా జరిగిన ఘటనపై హిందుత్వ కార్యకర్తగా చెప్పుకునే స్వతంత్ర భరద్వాజ్‌పై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. భరద్వాజ్‌పై సెక్షన్ 307, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద

## మిస్ వరల్డ్‌గా జోహేరీ మోలా

వియత్నాం– సూర్య వాస్తవం

వియత్నాంలోని న్హా ట్రాంగ్‌లో శనివారం జరిగిన 73వ అంతర్జాతీయ అందాల పోటీల గ్రాండ్ ఫైనల్లో డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన జోహేరీ మోలా మిస్ వరల్డ్ 2026 కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. ఆమె ప్రతిష్టాత్మకమైన నీలి కిరీటాన్ని గెలుచుకున్నారు. 110 దేశాల నుంచి వచ్చిన అందెగత్తెలతో పోటీపడి జోహేరీ మోలా విజయం సాధించారు. భారతదేశానికి

- మిగతా 2లో..



# నేపాల్‌లో మృతులు 1,344

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొంది. డీఎన్ఏ సేకరణతో సహా అవసరమైన ప్రక్రియలు పూర్తయిన తర్వాత, సుమారు 1,030 మృతదేహాలను తాత్కాలికంగా ఖననం చేసినట్లు నేపాల్ పోలీసులు తెలిపారు. వరద ప్రభావిత జిల్లాల్లోని జలవిద్యుత్ ప్రాజెక్టుల వద్ద భారీ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అక్కడ వందలాది మంది సొరంగాల్లో చిక్కుకుపోయినట్లు భావిస్తున్నారు. ఈ ఆపరేషన్లలో భారత్, చైనా నిపుణుల బృందాలు నేపాల్ నిపుణులకు సహకరిస్తున్నాయి. శుక్రవారం నుంచి సొరంగాల నుంచి ముగ్గురిని రక్షించారు. కొండచరియలు విరిగిపడే ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు కార్మికులు శనివారం చికిత్స పొందుతూ మరణించారు. అయితే భారీ వర్షాల నేపథ్యంలో దార్చులా జిల్లాలోని భట్టార్ ప్రాంతంలో తాజాగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో చౌలానీ నది ప్రవాహానికి అడ్డంకిగా మారింది. నదిలో అడ్డంగా పడిన రాళ్లు తొలగిపోతే వరద ప్రమాదం పొంచి ఉంది.

# సుభాష్ చంద్రపై సీబీఐ కేసు

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించారని ఎల్ఐసీహెచ్ఎఫ్ఎల్ ఆరోపించింది. దాదాపు రూ.22,006 కోట్ల క్లెయిమ్‌లకు(ఎశ్రీఖఅఎం), చంద్ర వ్యక్తిగత ఆస్తి నుంచి కేవలం రూ.6.5 కోట్లు మాత్రమే వసూలు చేసుకోవడానికి రుణదాతలను అనుమతించే ఇటీవలి ఎన్‌సీఎల్‌టీ రుణ చెల్లింపు ప్రణాళికను వ్యతిరేకిస్తూ, నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ)ను ఆశ్రయించిన రుణదాతలలో ఎల్ఐసీహెచ్ఎఫ్ఎల్ కూడా ఒకటి.

ఈ ఫిర్యాదు ప్రకారం.. పాన్ ఇండియా ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సహ–రుణ గ్రహీతగా చేర్చి, వసంత్ సాగర్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అందించిన రూ.500 కోట్ల రుణానికి, అలాగే స్పిరిట్ ఇన్‌ఫ్రా పవర్, మల్టీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సహ–రుణగ్రహీతలుగా చేర్చి, డిజిటల్ సబ్‌స్క్రైబర్ మేనేజ్మెంట్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అందించిన రూ.480 కోట్ల రుణానికి సంబంధించినది. 'సుభాష్ చంద్ర రుణగ్రహీత సంస్థలు, అలాగే వాటి అధికారులు, డైరెక్టర్లతో కుమ్మక్కై ఎల్ఐసీహెచ్ఎఫ్ఎల్‌ను మోసం చేశారు. తద్వారా ఆ సంస్థలకు రుణాలు మంజూరయ్యేలా చేసి, ఆ నిధులను దుర్వినియోగం చేశారు' అని ఆరోపించింది. ప్రధాన రుణగ్రహీతలకు నిధులు విడుదల చేసేలా ఎల్ఐసీహెచ్ఎఫ్ఎల్‌ను మోసం చేయడానికి, వాస్తవానికి మించిన, తప్పుడు నికర విలువను చూపేలా నకిలీ పత్రాలను సృష్టించారని ఆరోపణలు చేస్తోంది. 2018 నుంచి 2026 మధ్య కాలంలో నేరపూరిత కుట్రలకు దిగారని ఎల్ఐసీ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కాగా సుభాష్ చంద్ర తన ఆస్తులను రూ.59,113 కోట్లుగా చూపించి వివిధ బ్యాంకుల్లో, సంస్థల్లో 22వేల కోట్ల రుణాలు పొందారు. వాటిని తీర్చడంలో విఫలమై దివాలా ప్రక్రియను ప్రకటించారు. అనంతరం ఎన్‌సీఎల్‌టీ ఏకసభ్య ధర్మాసనం 6.5 కోట్లకు సెటిల్‌మెంట్ తీర్పు ఇవ్వడం తీవ్ర కలకలం రేపి, పలు ఆరోపణలకు దారి తీసింది. ఈ లోపు ఎల్ఐసీ సీబీఐని సంప్రదించింది. సుభాష్ చంద్రపై ఆర్థిక మోసాల కింద కేసు నమోదు చేయాలని, చర్యలు చేపట్టాలని పలు ఆధారాలను కూడా అందజేసింది. ఆధారాలను పరిశీలించిన సీబీఐ క్రిమినల్ కుట్ర, మోసం, నేరపూరిత నమ్మకద్రోహం తదితర ఆరోపణల కింద సుభాష్ చంద్రపై మరో ముగ్గురైన పంకజ్ సురోలియా, అమిష్ పాండ్యా, రాజీవ్ ధోలకియాలపై కూడా సీబీఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించింది

# మిస్ వరల్డ్‌గా జోహెరీ మోలా

(మొదటి పేజీ తరువాయి)

ప్రాతినిథ్యం వహించిన నికితా పోర్వాల్ టాప్ 40 ఫైనలిస్టులలో ఒకరిగా నిలిచారు. స్పెయిన్‌కు చెందిన ఎలిసబెత్ రేనెస్ అలబెర్న్ మొదటి రన్నరప్‌గా నిలవగా, మలేషియాకు చెందిన తానుసియా చెట్టి రెండో రన్నరప్‌గా నిలిచారు.

# భరద్వాజ్‌పై హత్యాయత్నం కేసు నమోదు

(మొదటి పేజీ తరువాయి)

కేసులు నమోదు చేయాలని, ఆయనను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. సీజేపీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాతో పాటు ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరామ్) అధినేత, ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్, సీజేపీ కార్యకర్తలు పటేల్‌చౌక్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ ఆందోళన చేపట్టారు. ఢిల్లీ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భరద్వాజ్‌పై కఠిన చర్యలు తీసుకోవడంలో ఢిల్లీ పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. సంజయ్‌కుమార్‌పై దాడి జరిగినప్పటి నుంచి న్యాయం కోసం పోరాడుతున్నామని అశుతోష్ రాంకా తెలిపారు. ఘటనకు సంబంధించి భరద్వాజ్‌పై కఠినమైన క్రిమినల్ సెక్షన్లు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హత్యాయత్నం సెక్షన్ కూడా నమోదు చేయాలన్నారు. సౌరవ్ దాస్ మాట్లాడుతూ దాడి గురించి బహిరంగంగా మాట్లాడుతున్న వ్యక్తి ఇంకా బయట ఎలా తిరుగుతున్నారని ప్రశ్నించారు. ఢిల్లీ పోలీసులు అధికార బీజేపీ ఒత్తిడికి లొంగి చర్యలు తీసుకోవడం లేదని, దళిత కుటుంబానికి చెందిన సంజయ్, ఆయన కుమార్తెపై జరిగిన దాడిని తక్కువ చేసి చూపుతున్నారని విమర్శించారు. పోలీసుల వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. భరద్వాజ్‌కు రాజకీయ పలుకుబడి కారణంగా పోలీసులు రక్షణ కల్పిస్తున్నారన్న ఆరోపణలను ఢిల్లీ పోలీసులు ఖండించారు.

**భరద్వాజ్..వైరల్ వీడియోతో దుమారం**

నీట్ నిరసనల సమయంలో సీజేపీ కార్యకర్త నిషు ఆజాద్ తండ్రి సంజయ్‌పై దాడి చేశానని, ఆయన తల పగలగొట్టానని, రాజకీయ నేపథ్యం కారణంగా తనపై చర్యలు తీసుకోలేదని భరద్వాజ్ ఓ పాడ్‌కాస్ట్‌లో వ్యాఖ్యానిం చిన వీడియో వైరల్ కావడంతో వివాదం తలెత్తింది. దీంతో భరద్వాజ్‌ను అరెస్టు చేయాలని, కఠిన సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని సీజేపీ డిమాండ్ చేసింది.

**72 గంటల్లో అరెస్టు**

ఎఫ్ఐఆర్‌లో సంబంధిత చట్టపరమైన సెక్షన్లు చేర్చాలన్న తమ డిమాండ్‌ను పోలీసులు అంగీకరించారని సంజయ్ ఆజాద్ తెలిపారు. నిందితులను 72 గంటల్లో అరెస్టు చేస్తామని పోలీసులు హామీ ఇచ్చారని చెప్పారు. ఢిల్లీ పోలీసులపైనా, రాజ్యాంగంపైనా తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఘటన అనంతరం తన తండ్రికి కుట్లు వేయాల్సి వచ్చిందని, పోలీసులు చర్యలు తీసుకో వడంలో జాప్యం చేస్తున్నారని నిషు ఆజాద్ పేర్కొన్నారు. నిందితుడిపై ఎందుకు కఠినమైన సెక్షన్లు నమోదు చేయలేదని ఆమె ప్రశ్నించారు. న్యాయం కోసం కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ జోక్యం చేసుకోవాలని కోరారు. నిషు ఆజాద్‌కు రాహుల్‌గాంధీతో పాటు పలువురు ప్రతిపక్ష నేతలు మద్దతు తెలపడంతో జంతర్‌మంతర్ ఘటన ఢిల్లీలో మరోసారి రాజకీయ వివాదానికి దారితీసింది.

# విద్యార్థుల్లో సృజన నింపాలి

(మొదటి పేజీ తరువాయి)

వైపు మళ్లించాలన్నారు. చదువుతోపాటు క్రీడలు కూడా చాలా కీలకమని, కేవలం చదువపైనే కాకుండా పిల్లల దైనందిన జీవితాలపై కూడా టీచర్లు శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులను తరగతి గదికే పరిమితం చేయవద్దని, అప్పుడప్పుడూ బయటికి తీసుకెళ్లాలని తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవానికి ముందు రోజు, శుక్రవారం జాతీయ పురస్కారాలు పొందిన ఉపాధ్యాయులతో సంభాషించారు. ప్రధానమంత్రి లోక్ కళ్యాణ్ మార్గ్ నివాసంలో జరిగిన ఈ సంభాషణకు సంబంధించిన వీడియోను శనివారం విడుదల చేశారు. బాల్యాన్ని పరిరక్షించాలని, పిల్లలలోని సహజ ఉత్సుకతను పెంపొందించాలని మోదీ ఉపాధ్యాయులను ప్రధా ని కోరారు.

తరగతి గది అభ్యాసాన్ని మరింత ఆసక్తికరంగా మార్చడానికి ఉపాధ్యాయులు సృజనాత్మక పద్ధతులను పంచుకోవాలని అన్నా రు. పిల్లల విద్యా పనితీరుకు ఉపాధ్యాయులు అతీతంగా చూడాలని, వారి ప్రవర్తన, దైనందిన జీవితాలపై శ్రద్ధ వహించాలని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు తగ్గుతున్నందున, పిల్లల జీవితాలలో ఉపాధ్యాయులు పోషించాల్సిన పాత్ర మరింత ముఖ్యమని అన్నారు. మాదకద్రవ్యాల గురించి మోదీ మాట్లాడుతూ.. కొన్ని పెద్ద నగరాలు, విశ్వవిద్యాల యాల్లో ఎవరు ఎవరికి ఏమి ఇస్తున్నారో తెలియకపోవడం వల్ల ఈ సమస్య వల్ల ఎవరైనా ప్రభావితమవుతున్నారా? వ్యసనాలబారిన పడుతున్నారా? లేదా? అని గుర్తించడం కష్టమ ని తలెఇపారు. 'ఇలాంటి పరిస్థితుల్లో, ఉపాధ్యాయులు అవగాహన కల్పించడానికి చొరవ తీసుకోవాలి. అలాగే, ఏ విద్యార్థి ప్రవర్తనలోనైనా ఏమైనా మార్పు కనిపిస్తుందేమో నిశితంగా గమనించాలి' అని చెప్పారు. ఉపాధ్యాయులు కేవలం పుస్తకాలు, సిలబస్‌లకే పరిమితం కాకుం డా విద్యార్థుల జీవితాల్లోకి ప్రవేశించాలని ప్రధానమంత్రి కోరారు. 'ఒక విద్యార్థి బాల్యం చనిపోవడానికి మీరు అనుమతించకూడదు. విద్యార్థుల జీవితాల్లో బాల్యాన్ని సజీవంగా ఉంచడం ద్వారా ఉపాధ్యాయులు అందించగల అతిపెద్ద సహకారం ఇదే'నని స్పష్టం చేశారు. విద్యార్థులను ఎక్కువసేపు స్క్రీన్ సమయానికి దూరంగా ఉంచి, బహిరంగ క్రీడా కార్యకలాపాల వైపు ఎలా ప్రోత్సహించవచ్చో కూడా మోదీ వివరించారు. పిల్లలకు ఒకే రకమైన ప్రాథమిక స్వభావం, జిజ్ఞాస ఉంటాయని, ఉపాధ్యాయులు ఈ జిజ్ఞాసను పెంపొం దించి, సరైన మార్గంలో నడిపిస్తే, వారి అభివృద్ధికి గణనీయమైన తోడ్పాటు అందించగలరని తెలిపారు.

**స్క్రీన్ టైమ్.. ఆందోళనకరం**

విద్యార్థుల్లో స్క్రీన్ టైమ్ ఒక ప్రధాన ఆందోళనగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. తమ పిల్లలు స్క్రీన్లపై ఎంత సమయం గడుపుతున్నా రో, రాత్రిపూట కూడా మొబైల్ ఫోన్లను ఉపయోగిస్తున్నారో లేదో అనే విషయాలపై తల్లిదండ్రులతో మాట్లాడాలని ఆయన ఉపాధ్యాయు లను కోరారు. క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యకలాపాలపై ఆసక్తిని పెంపొందించడం ద్వారా స్క్రీన్ టైమ్‌ను సహజంగా తగ్గించవచ్చని సూచించారు. జాతీయ విద్యా విధానాన్ని ప్రస్తావిస్తూ, పిల్లలను తరగతి గది బయటకు తీసుకువెళ్లి, వారికి నిజ జీవిత నైపుణ్యాలు, పనిరూపాలతో అనుసంధానం చేయాల్సిన ప్రాముఖ్యతను మోదీ స్పష్టం చేశారు.

**82 మందికి జాతీయ అవార్డులు**

ఈ సంవత్సరం, మూడు శాఖల నుంచి 82 మంది ఉపాధ్యాయులు, విద్యావేత్తలు జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. వీరిలో పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖకు చెందిన 48 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఉన్నత విద్యాసంస్థలు, పాలిటెక్నిక్‌లకు చెందిన 21 మంది ఉపాధ్యాయులు/ఫ్యాకల్టీ సభ్యులు ఉన్నారు. నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖకు చెందిన 13 మంది నైపుణ్య శిక్షకులు ఉన్నారు. అవార్డు గ్రహీతలు తమతమ బోధనా పద్ధతులను, అనుభవాలను ప్రధాని మోదీతో పంచుకున్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన.. టీచర్‌కు ప్రసంశ

తన పరిసరాల్లోని మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం గురించి మాట్లాడిన ఒక ఉపాధ్యాయురాలిని ప్రధానమంత్రి మోదీ ప్రశంసించారు. తన లోక్‌సభ నియోజకవర్గమైన వారణాసిలో తాను రొమ్ము క్యాన్సర్ అవగాహన ప్రచారాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. 'రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం ఎక్కువ మంది మహిళలు ముందుకు వస్తున్నారు. దీనికోసం గిన్నిస్ వరల్డ్ రికార్డును కూడా నెలకొల్పుతున్నారు. ఈ విషయాలను మీతో పంచుకోవడానికి నేను సంతోషిస్తున్నాను' అని ఆయన తెలిపారు.

# అడిషనల్ క్వాంటం పెన్షన్ పునరుద్ధరణ..

(మొదటి పేజీ తరువాయి)

చిరకాల డిమాండ్ అయిన 12వ పే–రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటుకు కూడా సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలలో రెండింటిని విడుదల చేయడానికి అంగీక రించారు. 1-7-2024, 1-1-2025 తేదీలకు చెందిన ఈ రెండు డీఏలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించనున్నారు. 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవుల మొత్తాన్ని వచ్చే సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. పోలీసులకు ఒక అదనపు సరెండర్ లీవ్‌ను ఈ దసరాకే చెల్లించేందుకు సుముఖత చూపారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఈహెచ్ఎస్)ను క్రమబద్ధీకరించి, వచ్చే నెల నుంచే ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయాల వల్ల ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.2,880 కోట్ల అదనపు భారం పడనుంది.

**గత పాలనలో ఉద్యోగులకు అవమానాలు: సీఎం చంద్రబాబు**

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా... గత రెండేళ్ల కాలంలో ఒకటో తేదీన క్రమం తప్పకుండా జీతాలు ఇస్తున్నాం.. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు ఇస్తున్నాం. 11 వేల మంది సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపచేశాం. ఉద్యోగులకు సంబంధించి ఉన్న పెండింగ్ బిల్లుల్లో ఇప్పటి వరకు రూ.30,849 కోట్లు క్లియర్ చేశాం. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా వడ్డీలకు అప్పులు తెచ్చింది. ఆర్థిక సంస్థలతో చర్చించి రూ.1.50 లక్షల కోట్ల మేర అప్పులపై భారీగా ఉన్న వడ్డీలను రీ షెడ్యూల్ చేసి తగ్గించుకోగలిగాం. ప్రస్తుతం సరాసరి 9.1 శాతం వడ్డీని ప్రభుత్వం అప్పులపై చెల్లిస్తోంది. ఈ భారాన్ని ఇంకా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. విధ్వంసమైన వ్యవస్థలను నెమ్మదిగా గాడిన పెడుతున్నాం. గత పాలకులు ఉద్యోగులను దగ్గరకే రానీయలేదు. రివర్స్ పీఆర్సీ ఇచ్చారు... అలాంటి పరిస్థితులు ఉద్యోగులు మరిచిపోవద్దు.

గత ప్రభుత్వం రిటైరైన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌ను కూడా పెండింగులో పెట్టింది. ఉద్యోగులను అవమానించేలా వాలంటరీలతో కరపత్రాలు పంపిణీ చేయించారు.. హోర్డింగులు పెట్టించారు... పేపర్లో ప్రకటనలు ఇచ్చారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మధ్యవర్తులతోనే మాట్లాడే పరిస్థితి నాడు ఉండేది. సమస్యల పరిష్కారం కోసం నాటి సీఎం కాళ్లు పట్టుకోవాలని అప్పుడు మంత్రులుగా ఉన్న వారు కామెంట్లు చేశారు... అవమానించారు. మంచికి చెడుకు ఉన్న వ్యత్యాసాన్ని ఉద్యోగులందరూ గుర్తించాలి. మేం ఉద్యోగులను గౌరవిస్తున్నాం... సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో ఉన్నాం. రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడకూడదని వారి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చాం. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ సానుకూలంగా ఉంటాం. ఆర్థిక వెసులుబాటు ఉంటే ఉద్యోగులకు సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. 2014లో నాడు విభజన తర్వాత ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేశాం. విభజనకు వ్యతిరేకంగా పోరాడింది ఉద్యోగులే. వారిని గౌరవించాలని.. ఇబ్బందులు వస్తాయని తెలిసినా... 43 శాతం ఫిట్మెంట్ ఇచ్చాం. ఉద్యోగులు వారి సమస్యల గురించి.. యూనియన్ల కోసం పని చేస్తారు. నేను రాష్ట్రం కోసం... ప్రజల కోసం ఆలోచించాలి. ఇందులో ఉద్యోగులూ భాగమే"అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

(మొదటి పేజీ తరువాయి)



ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

**ప్రజా పాలనలో అగ్రపీఠం – రైతు సంక్షేమం:**

సభలో భాగంగా రాష్ట్రంలో రైతులు, మహిళలు, నిరుద్యోగుల కోసం ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలను సీఎం రేవంత్ రెడ్డి వివరంగా ప్రస్తావించారు. ప్రధానంగా రైతు రుణమాఫీ ప్రక్రియ, పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు, రైతు భరోసా అమలు, అలాగే సన్న వడ్లకు ఇస్తున్న బోనస్ వంటి పథకాలు అన్నదాతల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని తెలిపారు. వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు పంపుసెట్లకు ఉచిత కరెంట్ ఇస్తున్నామని గుర్తుచేశారు.

**సూర్యచంద్రులు ఉన్నంత కాలం మహిళా ఉచిత బస్సు ప్రయాణం:**

మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం దూసుకుపోతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. 2034 నాటికి రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న మహత్తర లక్ష్యంతో ఆర్థిక ప్రయోజనం కల్పించే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని రాజకీయ లబ్ధి కోసం కొందరు నీరుగార్చాలని ప్రయత్నించారని, కానీ ఆ కుట్రలు చెల్లవని స్పష్టం చేశారు. సూర్యుడు ఉదయించినంత కాలం, చంద్రుడు ఉన్నంత కాలం మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం ఎటువంటి ఆటంకం లేకుండా నిరంతరం కొనసాగుతుందని ఆయన గట్టిగా భరోసానిచ్చారు.

**అర్హులందరికీ వివక్ష లేని సంక్షేమ ఫలాలు:**

కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియతో పాటు, రాష్ట్రంలోని 3.48 కోట్ల మంది పేద ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని సీఎం తెలిపారు. గృహజ్యోతి పథకం కింద ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కేవలం రూ. 500కే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తూ, పేదల జీవితాల్లో గుణాత్మక మార్పు తెచ్చేందుకు తమ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని పేర్కొన్నారు.

**నకిరేకల్ నియోజకవర్గంలో రూ. వందల కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన:**

ఈ పర్యటనలో భాగంగా నకిరేకల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి మరియు సంక్షేమ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. కడపర్తి గ్రామంలో రూ. 200 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్" నిర్మాణానికి అంకురార్పణ చేయడంతో పాటు, నియోజకవర్గంలో రూ. 9.85 కోట్ల వ్యయంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే నకిరేకల్‌లో రూ. 20 కోట్ల వ్యయంతో సమీకృత మండల స్థాయి కార్యాలయాల సముదాయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మునిపంపుల మరియు గుడివాడ గ్రామాల్లో సుమారు రూ. 6.36 కోట్ల వ్యయంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లతో కూడిన 33/11 కేవి సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులను ప్రారంభించారు. నకిరేకల్––గురజాల రోడ్డు విస్తరణతో పాటు బైరౌనిబండ, అమ్మనబోలు, రామాంజాపూర్ రోడ్ల అభివృద్ధి కోసం రూ. 45.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు, నకిరేకల్‌లో రూ. 1.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ఎక్సైజ్ శాఖ భవన నిర్మాణానికి కూడా ఆయన శంకుస్థాపనలు చేశారు.

రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## జీడీపీ పెరుగుతోంది... కానీ...




2026 ఏప్రిల్ నుంచి జూన్ మధ్య భారతదేశ వాస్తవ జీడీపీ 7.8 శాతం వృద్ధి చెందింది. గత సంవత్సరం ఇదే త్రైమాసికంలో వృద్ధి రేటు 6.9 శాతంగా ఉంది. ఆర్‌బిఐ 7 శాతం వృద్ధి రేటును అంచనా వేసింది. దీని అర్థం భారతదేశ పనితీరు అంచనాలను మించిపోయింది.అయితే ఈ పెరుగుదలకు సామాన్య ప్రజలు చేసే కొనుగోళ్లు అతిపెద్ద కారణం కాదు రోడ్లు, కర్మాగారాలు, యంత్రపరికరాలు , ఇతర ప్రధాన ప్రాజెక్టులలో పెట్టుబడి 11.9 శాతం పెరిగింది. సేవా రంగం 10 శాతం వృద్ధి చెందింది. బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, ఐటీ , వృత్తిపరమైన సేవలు 12.1 శాతం వృద్ధి చెందాయి. పోల్చి చూస్తే, సామాన్య ప్రజల వ్యయం 7.1 శాతం పెరగగా, వ్యవసాయ రంగం కేవలం 3.6 శాతం మాత్రమే పెరిగింది. దీని అర్థం ఏంటంటే, పెద్ద కంపెనీలు, తయారీ , సేవా రంగాలు దేశ వృద్ధిని నడిపించాయి. గ్రామీణ ప్రాంతాలు, చిన్న వ్యాపారాలు , సాధారణ కుటుంబాలు వెనుకబడి ఉన్నాయి. అందుకే సానుకూల జీడీపీ గణాంకాలు గృహ బడ్జెట్‌లలో ఇంకా స్పష్టంగా ప్రతిబింబించడం లేదు. దేశాలు, పెద్ద కంపెనీలు ఎక్కువ సంపాదించవచ్చు, కానీ అదే వేగంతో కొత్త ఉద్యోగాలు ఉండవు. యంత్రాలు, కొత్త సాంకేతికత తక్కువ మంది కార్మికులతో ఎక్కువ సాధించడానికి సహాయపడతాయి. దీనివల్ల ఉత్పత్తి, జీడీపీ పెరుగుతాయి, కానీ ఉద్యోగార్థులు తక్షణ ప్రయోజనాలను చూడలేరు.గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక జీడీపీని 2011-12ను ప్రాతిపదికగా తీసుకున్న పాత విధానంలో కొందరు రూ.86 లక్షల కోట్లుగా లెక్కించారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక జీడీపీని 2022-23 బేస్ ఇయర్‌గా తీసుకున్న కొత్త విధానంలో రూ.88 లక్షల కోట్లుగా లెక్కించారు.ఈ రెండు గణాంకాలను నేరుగా పోల్చడం వల్లే కొందరు విమర్శకులు వృద్ధి రేటు కేవలం 2-2.3 శాతమేనని చెబుతున్నారని నాగేశ్వరన్ పేర్కొన్నారు.అయితే, రెండు వేర్వేరు విధానాల్లో లెక్కించిన గణాంకాలను నేరుగా పోల్చడం సరికాదని స్పష్టం చేశారు.గత ఏడాది తొలి త్రైమాసిక జీడీపీ గణాంకాలను కూడా కొత్త విధానంలో తిరిగి లెక్కించి, ఆ తర్వాత ప్రస్తుత ఏడాది గణాంకాలతో పోల్చాలని సీఈఏ వివరించారు.పాత సిరీస్ కొనసాగి ఉంటే, కొత్త మెథడాలజీ ప్రకారం ఈజ26 ఖ1 జీడీపీ రూ.86 లక్షల కోట్ల కంటే ఎక్కువగా, దాదాపు రూ.90 లక్షల కోట్లకు చేరి ఉండేదని ఆయన అంచనా వేశారు.అలా సవరించిన గత ఏడాది గణాంకంతో ప్రస్తుత ఏడాది రూ.88 లక్షల కోట్ల జీడీపీని పోల్చినప్పుడే వాస్తవికమైన, న్యాయమైన వృద్ధి రేటు తెలుస్తుందని చెప్పారు.అంతేకానీ, భిన్నమైన కొలమానాలతో వచ్చిన రెండు అంకెలను నేరుగా పోల్చి వృద్ధిని అంచనా వేయడం సరైన పద్ధతి కాదన్నారు.గత ఏడాది జీడీపీ గణాంకాల్లో వచ్చిన మార్పులకు కేవలం డబుల్ డిఫ్లేటర్ విధానమే కారణం కాదని నాగేశ్వరన్ తెలిపారు.మెరుగైన కార్యనిర్వహణ, అసంఘటిత రంగానికి మరింత విస్తృతమైన కవరేజీ వంటి పలు అంశాలు కూడా ఇందుకు కారణమని వివరించారు.కొత్త విధానంలో ఈజ26 గణాంకాలు పెరగకపోవడం కూడా గతంలోనే ఆర్థిక వ్యవస్థను సరైన స్థాయిలో కవర్ చేశామనడానికి ఒక సూచనగా ఆయన పేర్కొన్నారు.జీడీపీని లెక్కించేటప్పుడు నామినల్ జీడీపీ, అంటే ధరల మార్పుల ప్రభావంతో కూడిన గణాంకం నుంచి రియల్ జీడీపీని గుర్తించాలి.రియల్ జీడీపీ అంటే ధరల ప్రభావాన్ని తొలగించిన తర్వాత ఉత్పత్తి వాస్తవంగా ఎంత పెరిగిందో చూపించే గణాంకం.ఇందుకోసం ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తొలగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో ఉపయోగించే సాధనాన్నే 'డిఫ్లేటర్' అంటారు.అంతర్జాతీయ సంస్థల సూచనలతోనే డబుల్ డిఫ్లేటర్ విధానం తీసుకోలేదుడబుల్ డిఫ్లేటర్ పద్ధతిని కేవలం అంతర్జాతీయ సంస్థల సూచనల మేరకే భారత్ అనుసరిస్తోందన్న వాదనను నాగేశ్వరన్ తోసిపుచ్చారు.గణాంక నిపుణులతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ విధానాన్ని ఎంచుకున్నామని తెలిపారు.ఇన్‌పుట్, అవుట్‌పుట్ ధరలు వేర్వేరు కారణాల వల్ల మారుతుంటాయని, అందువల్ల వాటి ధరల ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయడానికి డబుల్ డిఫ్లేటర్ పద్ధతి సరైనదని వివరించారు.దేశ ఆర్థిక వ్యవస్థ నమోదు చేసిన 7.8 శాతం వృద్ధి రేటు అకస్మాత్తుగా వచ్చినది కాదని నాగేశ్వరన్ స్పష్టం చేశారు.దీనికి ముందే పలు నెలవారీ ఆర్థిక సూచికలు బలమైన వృద్ధి సంకేతాలను ఇచ్చాయని తెలిపారు.జీఎస్టీ వసూళ్లు, ఈ-వే బిల్లుల జారీ, వాహన విక్రయాలు, ఎగుమతుల వృద్ధి, బ్యాంకు రుణాల పెరుగుదల వంటి సూచికలు ఆర్థిక కార్యకలాపాల్లో వేగాన్ని ముందుగానే సూచించాయని పేర్కొన్నారు.ఈ వివరాలు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమ్స్, ప్రభుత్వ ఖజానా వంటి విశ్వసనీయ వనరుల నుంచి సేకరించినవేనని చెప్పారు. ఉద్యోగాలపై ప్రభావం చూపే అంశాలు ఒక్కటే కావని, సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులు, సామాజిక-ఆర్థిక పరిస్థితులు, స్వచ్ఛందంగా ఉద్యోగం చేయకూడదనే నిర్ణయం వంటి అనేక అంశాలు దీనిపై ప్రభావం చూపుతాయని వివరించారు.ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంలో ఉద్యోగాల వృద్ధికి సంబంధించిన ధోరణులు మెరుగ్గా ఉన్నాయని నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు.

# నేరగాళ్లపై నిఘా...!!

- రౌడీ షీటర్లకు తనదైన శైలిలో కౌన్సిలింగ్..
- ఆకతాయిల గుండెల్లో రైళ్లు..
- శాంతి భద్రతల పర్యవేక్షణలో సీఐ వెంకటేశ్వర్లు మార్క్





**శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం:** పోలీస్ వ్యవస్థ పట్ల ఓవైపు ప్రజలలో అవగాహన కల్పిస్తూ మరోవైపు శాంతి భద్రతలకు విఘాతం కల్పించే అల్లరి మూకల పట్ల ఎప్పటికప్పుడు నిఘా ఉంచి నేరగాళ్ల ఆట కట్టిస్తున్నారు కదిరి అర్బన్ సీఐ బి వెంకటేశ్వర్లు. ఇటీవలనే అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు డిఎస్పి శివ నారాయణ స్వామి సూచనల మేరకు పట్టణంలోని నేరగాలపై నిఘా ఉంచి వారికి పూర్తిస్థాయిలో కౌన్సిలింగ్ ఇస్తున్నారు అదేవిధంగా పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి వివరాలను సేకరించుకొని వారికి తనదైన శైలిలో వారి భరతం పడుతున్నారు. తన విధి నిర్వహణలో ఎక్కడ కూడా రాజీ పడకుండా పట్టణం ప్రశాంతంగా ఉండే విధంగా సీఐ వెంకటేశ్వర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. అర్బన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పట్టణంలో నేరగాళ్ళ చిట్టాతో పాటు రౌడీషీటర్లు దొంగతనాలు హత్య కేసుల్లో నిందితులుగా ఉన్న వారి వివరాలను తీసుకొని వారి పైన నిగా పెట్టారు నేర చరిత్ర కలిగిన వారిని పిలిపించుకొని కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు కొంతమందిలో మార్పు రాకపోవడంతో అలాంటి వారిని తీవ్రంగా పరిగణిస్తూ వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నారు. అలాకాకుండా ఇష్టానుసారం నిబంధనలను ఉల్లంఘించి శాంతి భద్రత లకు భంగం కలిగించినట్లయితే తాము కూడా తగిన రీతిలోనే కోటింగ్ కూడా ఇస్తామని ఘాటుగా హెచ్చరించారు. పట్టణంలో నేర నియంత్రణ కోసం పట్టణ ఎస్సైలు బాబ్జాన్, ధనుంజయ రెడ్డి తోపాటు ఇతర సిబ్బందితో శాంతిభద్రతల పరిరక్షణ, రౌడీషీటర్ల కట్టడి, రాత్రి సమయంలో పహారా, డ్రంకెన్ డ్రైవింగ్ నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, దొంగతనాల పట్ల ప్రజ లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో పోలీసు అధికారులు తీసుకున్న చర్యలు..

### బైండోవర్ చర్యలు

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, తరచూ గొడవలకు పాల్పడే వ్యక్తులపై బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్లు 126, 129 ప్రకారం ముందస్తు చర్యలు చేపడుతున్నారు. జూలై, ఆగస్టు నెలల్లో మొత్తం 11 కేసుల్లో 38 మంది నుంచి పూచీకత్తులు తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన 5 మందికి పూచీకత్తు ఫోర్‌ఫీచర్ నోటీసులు జారీ చేయగా, పూచీకత్తు షరతులను ఉల్లంఘించిన ఒక వ్యక్తిని జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించారు. సంబంధిత వ్యక్తులపై ఒక సంవత్సరం కాలానికి రూ.5 లక్షల పూచీకత్తు షరతులు విధించారు.

### రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్

పలు శారీరక నేరాల్లో ప్రమేయం ఉన్న లిరౌడీషీటర్ నెం.349 షేక్ ముజాహిద్ ఏ ముజ్జు (20)లిపై పీడీ యాక్ట్ అమలు చేశారు. నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగుతోంది.

### రాత్రి పహారా పటిష్టం

దొంగతనాలు, రాత్రివేళ జరిగే ఇతర నేరాల నియంత్రణ కోసం ఇప్పటికే ఉన్న రెండు రెగ్యులర్ నైట్ బీట్‌లకు అదనంగా 1o1 మఫ్టీ/లర్కింగ్ నైట్ బీట్‌లు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లు, నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాలు, అనుమానాస్పద ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోంది.

### ప్రజల భద్రతపై అవగాహన కార్యక్రమాలు

ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు వార్డుల వారీగా మహిళలు, బాలల భద్రత, ఎన్ డి పి ఎస్ ద్వారా మాదకద్రవ్యాల దుర్వినియోగం నివారణ, వినాయక చవితి ఉత్సవాల్లో శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత, నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

### డ్రంకెన్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు

రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణ రక్షణలో భాగంగా మోటారు వాహనాల చట్టం సెక్షన్ 185 కింద డ్రంకెన్ డ్రైవింగ్‌పై విస్తృత తనిఖీలు నిర్వహించారు. జూలైలో 22, ఆగస్టులో 46 కలిపి మొత్తం 68 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి రూ.4,09,000 జరిమానా వసూలు చేశారు. డ్రంకెన్ డ్రైవింగ్‌కు పాల్పడిన 7 మందిని జైలుకు పంపించారు.

### ట్రాఫిక్ ఉల్లంఘనలపై చర్యలు

హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, ట్రిపుల్ రైడింగ్, పర్మిట్ లేకుండా వాహనాలు నడపడం, బీమా లేకపోవడం, ఓవర్‌లోడింగ్ తదితర ఉల్లంఘనలపై మొత్తం 414 కేసులు నమోదు చేసి రూ.1,34,740 జరిమానా వసూలు చేశారు.

### మొత్తం ట్రాఫిక్ చర్యలు

జూలై 15 నుంచి ఆగస్టు 31 వరకు కదిరి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 482 ట్రాఫిక్ కేసులు నమోదు చేశారు. ఇందులో 68 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, 414 ఇతర ట్రాఫిక్ ఉల్లంఘనల కేసులు ఉన్నాయి. మొత్తం రూ.5,43,740 జరిమానా వసూలు చేశారు.

ప్రధానంగా ఇప్పటివరకు 482 ట్రాఫిక్, 68 డ్రంకెన్ డ్రైవ్, 414 ఇతర ట్రాఫిక్ కేసులు నమోదు చేశారు. రూ.5,43,740 -- మొత్తం ట్రాఫిక్ జరిమానాలు విధించారు. 7 మంది -- డ్రంకెన్ డ్రైవింగ్‌లో జైలుకు పంపించారు.

38 మంది -- బాండ్‌ఓవర్/పూచీకత్తు చర్యలు
5 మంది -- పూచీకత్తు ఫోర్‌ఫీచర్ నోటీసులు
1 వ్యక్తి -- పూచీకత్తు షరతుల ఉల్లంఘనపై జ్యుడిషియల్ రిమాండ్
1 రౌడీషీటర్ -- పీడీ యాక్ట్ అమలు.

కదిరి పట్టణంలో నేరాలను అరికట్టడం, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడం, శాంతిభద్రతలను కాపాడటమే పోలీసుల ప్రధాన లక్ష్యమని, డీఎస్పీ శివ నారాయణస్వామి సీఐ బి. వెంకటేశ్వర్లు తెలిపారు. నేర నియంత్రణ, రోడ్డు భద్రత, ప్రజా భద్రతకు సంబంధించి చేపడుతున్న చర్యలు ఇకముందు కూడా నిరంతరాయంగా కొనసాగుతాయని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న వినాయక చవితి పండుగను అందరూ కలిసి ప్రశాంతంగా జరుపుకోవాలని డి.ఎస్.పి, సీఐ విజ్ఞప్తి చేశారు.

# ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

- హోస ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్ హుస్సేనాపురంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**ప్యాపిలి- సూర్య వాస్తవం:** ప్యాపిలి మండలం హుస్సేనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను విద్యార్థులు పూర్వ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఘనంగా నిర్వహించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను కొనియాడుతూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ వేడుకలు భారత మాజీ రాష్ట్రపతి గొప్ప విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేయడంతో ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమంలో 1998-99 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి జె. వెంకటరామిరెడ్డి స్వగ్రామం: ఎన్. రంగాపురం ఆర్థిక సహకారంతో పాఠశాలకు రెండు టేబుళ్లను అందజేశారు. అదేవిధంగా వారి ఆర్థిక సాయంతో ఈరోజు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి, కార్యక్రమ విజయవంతానికి తోడ్పడిన జె.వెంకటరామిరెడ్డి ఉదారతను అందరూ అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్ ఎం బి. చంద్రమౌళి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును వారి ఉత్తమ ప్రవర్తనను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు.గురువులు నేర్పిన విలువలను అలవర్చుకుని, విద్యార్థులు చదువులోనూ, జీవితంలోనూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన పిలుపునిచ్చారు.వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తరగతులను నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల తమ కృతజ్ఞతను చాటుతూ ప్రసంగాలు పాటలు నృత్యాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి అలరించారు.ఈ సందర్భంగా హుస్సేనాపురం పూర్వ విద్యార్థుల సంఘం (హోస) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. చంద్రమౌళి గారితో పాటు మిగతా ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బందిని హోసా ప్రతినిధులు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. ఈ సందర్భంగా తాము ఈ స్థాయికి చేరడానికి కారణమైన గురువులకు పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ( ఎస్ఎంసి) చైర్మన్ రవి కుమార్ పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్ పాఠశాల కమిటీ సభ్యులు స్థానిక నాయకులు, తల్లిదండ్రులు మరియు విద్యా ర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం విద్యార్థులందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు.

# నేడే వర్షం కోసం ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్ధనలు




**పామిడి - సూర్య వాస్తవం:** గుంతకల్ నియోజకవర్గం పరిధిలోని పామిడి మండలంలో ఉన్న ముస్లిం సోదరులందరూ కలసి ఆదివారం ఆదర్శ పాఠశాలకు వెళ్లే దారిలో ఉన్న మదరసా ఏఖాసిముల్ ఉలుమ్ ప్రాంగణంలో 8 గంటలకు వర్షంకోసం ప్రత్యేక ప్రార్థనలు చేయుటకు రావాలని మసీదు పెద్దలు శనివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతాంగం తపిస్తూ ఆవేదనను చూసి వరుణ్ దేవుడా కరుణించు, ఎండిపోతున్న పంట పొలాలను బ్రతికించవాని వరుణ దేవుని కోసం ప్రత్యేక ప్రార్థనలు తమ ప్రాంగణములో ప్రార్థనలు నిర్వహించుటకు రావాలన్నారు. జూన్ మాసంలో కురిసిన తడిపుడి వర్షానికి సకాలంలో వర్షం వచ్చిందని రైతులు ఎంతో ఆశతో పంటలు సాగు చేశారని, దాదాపు 3నెలలు గడుస్తున్నా వర్షం రానందున మొలచిన పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతుల ఆందోళన ఆవేదన చెందుతున్నారని, పంటల పడితే ప్రజలందరూ సుభిక్షంగా జీవించగలమని వారు వ్యక్తపరిచారు. కావున ముస్లిం సోదరులు. కలవాలన్నారు.

## రామేశ్వర తీర్ధంతో పరమేశ్వరుడికి మహాభిషేకం...!

**200 బాటిళ్లలో భక్తులకు రామేశ్వర తీర్థ ప్రసాదం పంపిణీ**



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** స్థానిక శ్రీనివాస్ నగర్‌లోని శ్రీ సీతారామాంజనేయ దేవస్థానంలో రామేశ్వరం నుంచి తీసుకొచ్చిన పవిత్ర తీర్థంతో శివునికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని శనివారం ఉదయం వైభవంగా నిర్వహించారు. రామేశ్వరం నుంచి తీసుకొచ్చిన 22 ఆవుల తీర్థం, కోటి తీర్థంతో శివునికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 బాటిళ్లలో రామేశ్వర తీర్థాన్ని భక్తులకు పంపిణీ చేశారు. పవిత్ర తీర్థ ప్రసాదాన్ని స్వీకరించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము, కమిటీ సభ్యులు రాంప్రసాద్, రామ్మూర్తి, మహేంద్ర, అనిల్, ప్రసాద్, సాయి, ప్రకాష్, శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం

**- గురుపూజోత్సవంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్...!**

**- ఉపాధ్యాయుల సేవలను కొనియాడిన జిల్లా కలెక్టర్**



**అనంతపురం - కలెక్టరేట్ సూర్య వాస్తవం :** నగరంలోని ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల డ్రామా హాల్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం (గురు పూజోత్సవం), జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై, ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలను అందజేశారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను కొనియాడారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎస్. జయమ్మ



**పామిడి - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా పామిడి మండలం ఎదురూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న ఎస్. జయమ్మకు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జిల్లా విద్యాశాఖ అధికారి అయూబ్ ఖాన్ చేతులమీదుగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు లభించింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీసేందుకు నిరంతరం కృషి చేస్తున్న జయమ్మ సేవలను గుర్తించిన అధికారులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసి సత్కరించారు. విద్యార్థుల పట్ల ఆప్యాయత బోధనలో నిబద్ధత పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషికి ఈ అవార్డు గుర్తింపుగా నిలిచింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామస్థులు ఎస్. జయమ్మకు అభినందనలు తెలిపారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మారుమూల ప్రాంతాల్లోనూ మౌలిక వసతుల కల్పన

**- బి.కనేకల్లులో రూ.6.35 కోట్లతో రహదారి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కాలవ భూమిపూజ**



**కనేకల్లు - సూర్య వాస్తవం :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను కొత్త పుంతలు తొక్కిస్తున్నామని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీని వాసులు పేర్కొన్నారు. కనేకల్లు గ్రామంలో రూ.6.35 కోట్లతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాయదుర్గం నుంచి వేపరాల వెళ్లే ప్రధాన రహదారిలో కనేకల్లు శివార్ల నుంచి కొత్తపల్లి, ఆదిగానిపల్లి, రచ్చుమర్రి మీదుగా సుమారు 10 కిలోమీటర్ల మేర రహదారిని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్పెషల్ అసిస్టెన్స్ టు ది స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ పథకం ద్వారా రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల కోసం నిధులు అందుతున్నాయని ఆయన వివరించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ శాశ్వత మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చే రాష్ట్రాలకు కేంద్రం అదనపు ప్రోత్సాహక కింద ఈ నిధులను అందిస్తోంద న్నారు. అలాంటి నిధులను సద్వినియోగం చేసుకుంటూ రాయదుర్గం నియోజకవర్గంలోని అత్యంత మారుమూల ప్రాంతమైన కనేకల్లులో రూ.6.35 కోట్లతో రహదారి అభివృద్ధి పనులు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఉపాధి హామీ నిధులను గరిష్ట స్థాయిలో వినియోగించుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నార న్నారు. గ్రామీణ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం అభినందనీ యమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలు అమలు కావడం గ్రామీణ ప్రాంత ప్రజల్లో నూతన ఆశలు, ఆసక్తిని కలిగిస్తోందన్నారు. రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, యువ నాయకుడు నారా లోకేష్‌లకు నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వన్నారెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ యు.హనుమంత రెడ్డి, ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు లాలేప్ప, రమేష్, సుదర్శన్, బసవరాజు, చాంద్, నరేంద్ర, మరియప్ప, జయరాం చౌదరి, రైస్ మిల్ చంద్ర, నరేంద్ర, బాబు, నాగార్జున, కురుబ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో సత్తా చాటిన ఎస్ఆర్ఐటీ

**- 78 మంది ఎస్ఆర్ఐటీ విద్యార్థులకు టీసీఎస్‌లో ఉద్యోగాలు**




**శింగనమల - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల పరిధిలోని శ్రీ రామానుజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఐటీ) కళాశాల విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో సత్తా చాటారు. ప్రముఖ గ్లోబల్ ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నిర్వహించిన నియామక ప్రక్రియలో కళాశాలకు చెందిన 78 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఉద్యోగా లకు ఎంపికయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని కళాశాల కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. టీసీఎస్ నియామక ప్రక్రియలో ప్రైమ్ విభాగం కింద 18 మంది విద్యార్థులు రూ.9.08 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికయ్యారు. వీరిలో సీఎస్‌ఈ నుంచి 7 మంది, సీఎస్ఎం నుంచి 5 మంది, ఈసీఈ నుంచి 4 మంది, ఈఈఈ నుంచి ఇద్దరు ఉన్నారు. అదేవిధంగా డిజిటల్ విభాగం కింద 32 మంది విద్యార్థులు రూ.7.09 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికయ్యారు. వీరిలో సీఎస్‌ఈ నుంచి 13 మంది, సీఎస్ఎం నుంచి 12 మంది, ఈసీఈ నుంచి 7 మంది ఉన్నారు. నింజా విభాగం కింద మరో 28 మంది విద్యార్థులు రూ.3.4 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికయ్యారు. వీరిలో సీఎస్‌ఈ నుంచి 9 మంది, సీఎస్ఎం నుంచి నలుగురు, ఈసీఈ నుంచి ఆరుగురు, ఈఈఈ నుంచి ఏడుగురు, ఎంఈసీ నుంచి ఇద్దరు ఉన్నారు. ఒకే సంస్థలో కళాశాలకు చెందిన 78 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విజయోత్సవ కార్య క్రమాన్ని నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్, ఇంటర్వ్యూ శిక్షణ అందిస్తున్నా మని సాంబశివారెడ్డి తెలిపారు. విద్యార్థుల ప్రతిభ, అధ్యాపకుల కృషి, ప్లేస్‌మెంట్ విభాగం అందించిన ప్రత్యేక శిక్షణతోనే ఈ విజయాన్ని సాధించామని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ కంపెనీల్లో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. జి. బాలకృష్ణ, కళాశాల వైస్ ప్రెసిడెంట్ డా. ఎం. రంజిత్ రెడ్డి, అధ్యాపకులు, ప్లేస్‌మెంట్ విభాగం సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# చట్టాలపై అవగాహనతో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలి

**- సిఐ హేమంత్ కుమార్...!**

**- మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక సూచనలు**




**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** ఇటుకలపల్లి పోలీసుల ఆధ్వర్యంలో అనంత లక్ష్మి ఇంజినీరింగ్ కళా శాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర హించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, ర్యాగింగ్, మహిళలు--చిన్నారుల భద్రత, రహదారి భద్రత తదితర అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు నో చెప్పాలని విద్యార్థులకు సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వన్‌టైమ్ పాస్‌వర్డ్, బ్యాంకు ఖాతా వివరాలు, గోప్య సంకేతాలను ఎవరికీ వెల్లడించకూడదని తెలిపారు. రహదారులపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసుల సహాయం పొందాలని తెలిపారు. పోలీసు అత్యవసర సేవలకు 100 లేదా 112, సైబర్ నేరాల ఫిర్యాదులకు 1930, బాలల సహాయానికి 1098, మహిళల సహాయానికి 181 నంబర్లను సంప్రదించాలని పోలీసులు సూచించారు. చట్టాలపై అవగాహన పెంచుకుని ప్రతి విద్యార్థి బాధ్యతాయుత పౌరుడిగా ఎదగాలని పోలీసులు ఆకాంక్షించారు.

# కేసీ రామన్న ఆసుపత్రిలో దారుణం.....!

- వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి
- వైద్యశాల ఎదుట బంధువుల ఆందోళన
- వైద్యుల నిర్లక్ష్యమేనంటూ బంధువుల ఆరోపణ
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు





**అనంతపురం వైద్యం – సూర్య వాస్తవం :** జ్వరం చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి వచ్చిన ఓ మహిళ ఇంజక్షన్ వేసిన కొద్దిసేపటికే మృతి చెందిన ఘటన అనంతపురం నగరంలో కలకలం రేపింది.బ్రహ్మసముద్రం మండలం గుడిపల్లి గ్రామానికి చెందిన గుండమ్మ (60) జ్వరం రావడంతో చికిత్స కోసం అనంతపురంలోని కేసీ రామన్న ఆసుపత్రికి వచ్చినట్లు సమాచారం. ఆసుపత్రిలో వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో, డాక్టర్ సూచనల మేరకు నర్సులు ఆమెకు ఇంజక్షన్ వేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఇంజక్షన్ వేసిన కొద్దిసేపటికే గుండమ్మ మృతి చెందినట్లు పేర్కొన్నారు. అయితే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే ఆసుపత్రి సిబ్బంది మృతదేహాన్ని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆరోపణలు వచ్చాయి.ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించినట్లు సమాచారం.ఈ ఘటనపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహిళ మృతికి అసలు కారణం ఏమిటనే విషయంపై పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల జాబితాపై ప్రత్యేక గ్రామ సభ...!

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు పరిశీలన
- అభ్యంతరాలు, మార్పులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచన



**అనంతపురం – సూర్య వాస్తవం :** వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల గ్రామ పంచాయతీలో శనివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు కార్యక్రమంపై ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వర్గాలకు చెందిన ఓటర్ల పేర్లను గ్రామ సభలో చదివి వినిపించి, ఓటర్ల జాబితాలో వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాన్ని ప్రజల సమక్షంలో పరిశీలించారు.అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో నమోదయ్యాయా, ఏవైనా అభ్యంతరాలు, మార్పులు లేదా సవరణలు అవసరమా అనే విషయాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు లేని అర్హులైన వారు సంబంధిత అధికారులను సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.ప్రజల సమక్షంలో పారదర్శకంగా ఓటర్ల వివరాలను పరిశీలించడం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. గ్రామ సభలో ప్రజలు తమ అభిప్రాయాలు, సందేహాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, డిప్యూటీ ఎంపీడీవో గౌస్ సాహెబ్, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా, గ్రామ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ఓటర్ల వివరాల పరిశీలనను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

# భార్యపై హత్యాయత్నం కేసులో భర్తకు రిమాండ్



**బెలుగుప్ప – సూర్య వాస్తవం:** భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడైన భర్తను అరెస్టు చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు బెలుగుప్ప పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి. శివ తెలిపారు.ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు, గంగవరం గ్రామానికి చెందిన ఫక్రుద్దీన్ మూడో కుమార్తె భాను బీకి కనేకల్ గ్రామానికి చెందిన హయాస్ కుమారుడు యాసిన్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా చెడు అలవాట్లకు బానిసైన యాసిన్ తన భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు తెలిపారు.ఈ క్రమంలో 2026 ఆగస్టు 29వ తేదీ రాత్రి సుమారు 1 గంట సమయంలో నిద్రిస్తున్న తన భార్యపై రోకలిబండతో ముఖంపై దాడి చేసి, కత్తితో గొంతు కోసి చంపేందుకు ప్రయత్నించినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితుడు యాసిన్‌ను 2026 సెప్టెంబర్ 5వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో గుండ్లపల్లి బస్‌స్టాప్ సమీపంలో అరెస్టు చేశారు. అనంతరం నిందితుడిని కళ్యాణదుర్గం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ జి.శివ తెలిపారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఎస్ నాగలక్ష్మి.



**పామిడి – సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలోని స్పెషల్ వార్డ్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని ఎన్ నాగలక్ష్మికి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డును అందుకున్నారు. ఈమె శనివారం అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్, అర్బన్ ఏంఎల్ఏ డి. వెంకటేశ్వరప్రసాద్, డిఈఓ అయూబ్ ఖాన్ చేతుల మీదుగా అవార్డు తోపాటు ప్రసంసా పత్రంను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో అందించి ఘనంగా సత్కరించారు. తాను విధులు నిర్వహిస్తున్న స్పెషల్ వార్డ్ పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు ప్రజలు అభినందించారు.

# వాల్మీకి మహర్షి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి ...!

- ప్రతి వాల్మీకి బిడ్డ ఉన్నతంగా చదువుకుని మంచి పేరు తీసుకురావాలి
- విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలు అలవర్చుకోవాలి

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



**అనంతపురం – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం గంజికుంట గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హాజరై వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి చూపిన సన్మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. వాల్మీకి సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ప్రతి వాల్మీకి బిడ్డ ఉన్నతంగా చదువుకుని సమాజానికి మంచి పేరు తీసుకు రావాలని కోరారు.తల్లిదండ్రులు తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందించి ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యతో పాటు మంచి నడవడి, క్రమశిక్షణ, విలువలను అలవర్చుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు.వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించిన గంజికుంట శివ శంకర్‌ను, గ్రామ ప్రజలను ఎంపీ ప్రత్యేకంగా అభినందించారు. వాల్మీకి మహర్షి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అలాగే గంజికుంట గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ కలిసికట్టుగా పనిచేసి గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడ్వకేట్ చంద్ర చర్ల హరి, సురేంద్ర, తిప్పయ్య, గంజికుంట శివ శంకర్, నరసింహులు, దేవేరి సుధాకర్, సుశీలమ్మ, లావణ్య, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, వాల్మీకి సోదర సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

# కుందుర్పిని 'ఆంధ్రా అరుణాచలం'గా అభివృద్ధి చేస్తాం...!

- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర మహా సంకల్పం
- వేలాది మంది భక్తులతో 10 గిరి ప్రదక్షిణలు పూర్తి
- అనంతపురం అనిల్‌కుమార్‌తో కలిసి పోస్టర్లు విడుదల
- సెప్టెంబర్ 26న ప్రత్యేక ఆధ్యాత్మిక--పర్యావరణ కార్యక్రమం



**అనంతపురం – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కుందుర్పి పవిత్ర కొండను 'ఆంధ్రా అరుణాచలం'గా అభివృద్ధి చేసి ఆధ్యాత్మికంగా మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడంతో పాటు ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర సంకల్పించారు. కుందుర్పి పవిత్ర కొండ చుట్టూ నిర్వహిస్తున్న గిరి ప్రదక్షిణలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటికే వేలాది మంది భక్తుల భాగస్వామ్యంతో 10 గిరి ప్రదక్షిణలు విజయవంతంగా పూర్తయ్యాయి. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణను అనుసంధానం చేస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో కుందుర్పి అభివృద్ధికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర, అనంతపురం అనిల్‌కుమార్ కలిసి పని చేయాలని నిర్ణయించారు. గిరి ప్రదక్షిణలు, మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర, అనంతపురం అనిల్‌కుమార్ సంయుక్తంగా విడుదల చేశారు.

**సెప్టెంబర్ 26న ప్రత్యేక కార్యక్రమం**

కుందుర్పి పవిత్ర కొండ సమీపంలో సెప్టెంబర్ 26న ప్రత్యేక ఆధ్యాత్మిక--పర్యావరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గిరి ప్రదక్షిణతో పాటు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

**ఒక భక్తుడు.. ఒక మొక్క.. ఒక బాధ్యత**

గిరి ప్రదక్షిణ సమయంలో భక్తులు ఒక మొక్కను వెంట తీసుకెళ్లి, ప్రదక్షిణ పూర్తయిన అనంతరం అనువైన ప్రదేశంలో నాటి సంరక్షించాలని నిర్వాహకులు సూచించారు. 'ఒక భక్తుడు--ఒక మొక్క--ఒక బాధ్యత' అనే సంకల్పంతో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.మొక్కను వృక్షేశ్వరునిగా భావించి నాటి సంరక్షించడం కూడా శివసేవలో భాగమేనని, మొక్కకు నీరు పోసి పెంచడం ద్వారా ప్రకృతి పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చని నిర్వాహకులు తెలిపారు.

కుందుర్పి పవిత్ర కొండకు ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాధాన్యతను పెంచడంతో పాటు ప్రాంత అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. భక్తి, ప్రకృతి పరిరక్షణ, ఆధ్యాత్మిక చైతన్యానికి కుందుర్పిని నిలయంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. సెప్టెంబర్ 26న జరిగే కార్యక్రమంలో భక్తులు, ప్రజలు, ఆధ్యాత్మికవేత్తలు, పర్యావరణ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.






## బిగ్ బాస్-10..
## హౌస్‌లోకి వెళ్లే సెలబ్రిటీలు వీళ్లేనా?

తెలుగు బుల్లితెరపై ఎంతగానో అలరిస్తున్న పాపులర్ రియాలిటీ షో 'బిగ్‌బాస్' పదో సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. కింగ్ అక్కినేని నాగార్జున మరోసారి హోస్ట్‌గా రేపు (సెప్టెంబరు 6) ప్రారంభం కానున్న ఈ సీజన్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి. గ్రాండ్ ప్రీమియర్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్దీ, ఈసారి బిగ్‌బాస్ హౌస్‌లోకి ఎవరు అడుగుపెట్టబోతున్నారనే దానిపై సోషల్ మీడియాలో తీవ్రమైన చర్చ జరుగుతోంది. పలువురు నటీనటులు, కమెడియన్లు, సోషల్ మీడియా స్టార్ల పేర్లతో కూడిన జాబితా ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది.ఈ ప్రచారంలో ప్రముఖంగా వినిపిస్తున్న పేర్లలో 'జబర్దస్త్' ఫేమ్, ప్రముఖ కమెడియన్ ఆటో రాంప్రసాద్ ఒకరు. అతడి పేరు ఆన్‌లైన్‌లో ట్రెండ్ అవుతోంది. అలాగే, 'వినాయకుడు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటుడు కృష్ణుడు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వీరితో పాటు 'పుష్ప', 'సాహో' వంటి చిత్రాల్లో విలన్ పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న టెంపర్ వంశీ, యువతలో మంచి క్రేజ్ ఉన్న నటుడు ఆదిత్ అరుణ్ పేర్లు కూడా బలంగా వినిపిస్తున్నాయి.ఇక టెలివిజన్ రంగానికి వస్తే, యాంకర్, నటి వర్షిణి సౌందరరాజన్ పేరు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు కన్నడ, తెలుగు సీరియల్స్‌తో పాపులర్ అయిన చైత్ర రాయ్, కన్నడ నటుడు ముఖేష్ గౌడ, నటి తేజస్విని గౌడ వంటి ఇతర భాషా నటులు కూడా ఈ సీజన్‌లో పాల్గొనే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

అలాగే, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సుధీర్ రెడ్డి, కమెడియన్ పొట్టి నరేశ్ పేర్లు కూడా సంభావ్య కంటెస్టెంట్ల జాబితాలో ఉన్నట్లు సమాచారం.అయితే, సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ జాబితాపై బిగ్‌బాస్ నిర్వాహకులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు. ప్రతీ సీజన్‌లో మాదిరిగానే ఈసారి కూడా చివరి నిమిషం వరకు సస్పెన్స్ కొనసాగిస్తున్నారు. దీంతో, ప్రచారంలో ఉన్న పేర్లలో ఎందరు నిజంగా హౌస్‌లోకి వెళతారు, కొత్తగా ఎవరు చేరతారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. అసలు కంటెస్టెంట్లు ఎవరో తెలియాలంటే గ్రాండ్ లాంచ్ ఎపిసోడ్ వరకు వేచి చూడాల్సిందే.

## 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్' - మూవీ రివ్యూ!




మలయాళంలో ఇప్పుడు ఎక్కువగా మాట్లాడుకుంటున్న సినిమా పేరే 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్'. నివిన్ పౌలి - మమితా బైజు ప్రధానమైన పాత్రలను పోషించిన సినిమా ఇది. రొమాంటిక్ కామెడీ జోనర్లో రూపొందిన ఈ సినిమా, మలయాళంలో ఆగస్టు 21వ తేదీన విడుదలైంది. తొలి ఆటతోనే హిట్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా, 200 కోట్లకి పైగా వసూళ్లతో దూసుకుపోతోంది. అలాంటి ఈ సినిమా, తెలుగు ప్రేక్షకుల ముందుకు ఈ నెల 4వ తేదీన వచ్చింది.జస్టిన్ (నివిన్ పౌలి) తన తల్లిదండ్రులతోను .. తమ్ముడు 'జోయెల్'తోను కలిసి నివసిస్తుంటాడు. క్యాటరింగ్ సర్వీస్ ను రన్ చేస్తూ ఉంటాడు. పెళ్లి చేసుకోవలసిన వయసు దాటిపోయి చాలాకాలమవుతుంది. స్నేహితులతో కలిసి తాగేస్తూ .. తిరిగేస్తూ ఉంటాడు. ఒక రోజున అతని పక్కింట్లోకి కొత్తగా ఒక ఫ్యామిలీ దిగుతుంది. తల్లిదండ్రులతో కలిసి ఆ ఇంట్లోకి దిగిన అమ్మాయి పేరే 'యాష్లే' ( మమితా బైజు). ఆమె తండ్రి తాగుబోతు అనీ .. ఆ అమ్మాయి డిగ్రీ చదువుతోందనే విషయం జస్టిన్ కి తెలుస్తుంది. 'యాష్లే'ను చూసిన ఆ ఊరు కుర్రాళ్లంతా మనసు పారేసుకుంటారు. ఆమె ఇంటిచుట్టూ చక్కర్లు కొడుతుంటారు. ముఖ్యంగా 'గ్లిక్సన్' ఆమె వెంటే తిరుగుతుంటాడు. జస్టిన్ కజిన్ సిస్టర్స్ రేష్మ - రియాలతో యాష్లేకి పరిచయమవుతుంది. వాళ్ల ద్వారానే ఆమె జస్టిన్ గురించి వింటుంది. ప్రేమించిన అమ్మాయిని పొందలేకపోయిన కారణంగానే అతను పెళ్లి చేసుకోలేదని తెలుసుకుంటుంది. అప్పటి నుంచి అతని పట్ల ఆమెకి ప్రత్యేకమైన అభిమానం పుడుతుంది. తనని యాష్లే ప్రేమిస్తుందని తెలుసుకున్న జస్టిన్ ఆ మాటను నమ్మలేకపోతాడు. ఇద్దరి మధ్యా ఉన్న ఏజ్ గ్యాప్ అందుకు కారణం. అయితే ఆమెనే స్వయంగా చెప్పడంతో ఆనందంతో పొంగిపోతాడు. అప్పటి నుంచి ఒకరికి ఒకరు మరింత చేరువైపోతారు. ఇద్దరూ కలిసి సరదాగా తిరుగుతుంటారు. అలాంటి పరిస్థితులలోనే యాష్లే మేనమామ 'అలెక్స్' ఆమె ఇంటికి వస్తాడు. జస్టిన్ కీ .. యాష్లే కి మధ్య ఏదో జరుగుతుందనే ఒక అనుమానం అతనికి వస్తుంది. అప్పుడు అతను ఏం చేస్తాడు? ఆ ఎఫెక్ట్ ఆ ఇద్దరి జీవితాలపై ఎలా పడుతుంది? అనేది మిగతా కథ.సాధారణంగా ప్రేమ ..పెళ్లి అంటూ అమ్మాయిల వెంట అబ్బాయిలే పడుతుంటారు. తమ వయసు కాస్త ముదిరిపోయినట్టుగా అనిపిస్తే, కవర్ చేయడానికి నానా కష్టాలు పడుతుంటారు.

అలా పెళ్లి చేసుకోకుండా ఉండిపోయిన ముదిరిపోయిన వ్యక్తి చుట్టూ, ఏజ్ గ్యాప్ చాలా ఎక్కువగా ఉన్న వ్యక్తిపై ఒక అమ్మాయి మనసు పారేసుకుంటే ఎలా ఉంటుందనే ఆలోచన చుట్టూ అల్లుకున్న కథనే ఈ సినిమా.జస్టిన్ .. యాష్లే .. జస్టిన్ తమ్ముడు జోయెల్ .. యాష్లేను ఆరాధించే గ్లిక్సన్ .. యాష్లే మేనమామ అలెక్స్ .. ప్రధానమైన పాత్రలుగా కనిపిస్తాయి. ఏజ్ గ్యాప్ ఎక్కువగా ఉన్న వ్యక్తి పట్ల యాష్లే ఆకర్షితురాలు కావడం .. అతనికి తన మనసులోని మాటను చెప్పడం .. నమ్మలేని ఈ నిజాన్ని జీర్ణించుకోవడానికి అతను కొంత సమయం తీసుకోవడం వంటి సన్నివేశాలతో ఫస్టాఫ్ సాగుతుంది. ఇక తమ ప్రేమ విషయంలో పెద్దలకు సర్దిచెప్పే విషయంలో ఇద్దరూ పడే ఇబ్బందులతో సెకండాఫ్ కొనసాగుతుంది. దర్శకుడు ఈ కథలో ఏ విషయాన్ని కూడా ప్రేక్షకుల దగ్గర కాసేపైనా దాచిపెట్టే ప్రయత్నం చేయలేదు. కథను అందంగా .. ఆహ్లాదంగా చెప్పడానికి తనవంతు ప్రయత్నం చేస్తూ వెళ్లాడు. అందువల్లనే ఇంటర్వెల్ బ్యాంగ్ ఉండాలని గానీ, క్లైమాక్స్ కి హడావిడి చేయాలని గాని అనుకోలేదు. అసలు ఇది ఒక సినిమాగా కాకుండా, మనకళ్ల ముందు జరుగుతున్న సంఘటనలను వీధి అరుగుపై కూర్చుని చూస్తున్నట్టుగా ఉంటుంది. కథలో కావాలని కామెడీని ఇరికించే ప్రయత్నం చేయలేదు. సందర్భాన్ని బట్టి .. చిన్న చిన్న మాటలతనే నవ్వులు పూయించారు. నిజానికి అనువాద సినిమాలలో కామెడీ వర్కౌట్ కావడం కష్టం. కానీ ఈ సినిమాలో సంభాషణలు బాగానే కుదిరాయి. జోయెల్ .. గ్లిక్సన్ పాత్రల వైపు నుంచి కామెడీని నడిపించిన తీరు ఆకట్టుకుంటుంది. హీరోయిన్ చాలా ఏజ్ గ్యాప్ ఉన్న ఒక వ్యక్తిని ప్రేమిస్తుంది .. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటుంది. ఆమె అలా అనుకుందంటే ఆ వ్యక్తిలో గొప్ప లక్షణాలు ఉండాలి. అలాంటి లక్షణాలతో ఆ పాత్రను నడిపించడంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడు. తమ ప్రేమను వ్యక్తం చేసే విషయంలో .. అవతలవారి ప్రేమను అంగీకరించే విషయంలో ఆలస్యం చేయకూడదని భావించిన హీరో, తన తమ్ముడి ప్రేమ వివాహాన్ని దగ్గరుండి జరిపించడం హీరో పాత్రను మరింత ఎలివేట్ చేస్తుంది.'పెళ్లి'కి నమ్మకమే పునాదిరాయి అని అంటారు. అయితే ఆ నమ్మకం ప్రేమ నుంచే మొదలవ్వాలి అని చాటిచెప్పే కథ ఇది. నిజమైన ప్రేమ అందాన్ని .. ఆస్తులను .. ఏజ్ గ్రూప్ ను కాదు, మంచి మనసును వెదుకుతూ వెళుతుందనే సందేశం ఈ కథలో మనకి కనిపిస్తుంది. పాత్రలు .. వాటి స్వరూప స్వభావాలు వాస్తవానికి చాలా దగ్గరగా ఉండటం వలన ప్రతి ఒక్కరూ ఈ కంటెంట్ కి కనెక్ట్ అవుతారు. ప్రతి ఫ్యామిలీ కూడా తెరపై సన్నివేశాలలో భాగమవుతుంది. కామెడీ కోసం అక్కడక్కడా సన్నివేశాలు కొన్ని కాస్త 'అతి'గా అనిపించినప్పటికీ, ఆ వెంటనే దార్లో పడిపోతూ వచ్చింది. నిజానికి ఈ తరహా సన్నివేశాలను రాసుకోవడం .. తెరపై ఆవిష్కరించడం చాలా కష్టం. ఆడియన్స్ అనుభవంలోకి .. అనుభూతిలోకి తీసుకెళ్లడం మరింత కష్టం.

కథ .. కథనం .. సంభాషణలు .. సన్నివేశాలు .. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఇవన్నీ కూడా కలిసిపోయి కనిపిస్తాయి. ఒకదాని నుంచి ఒకటి వేరు చేసి క్రెడిట్ ఇవ్వలేము. నటీనటుల సహజమైన నటన .. కంటెంట్ ను సహజంగా ఆవిష్కరించిన తీరు అందుకు కారణమని చెప్పాలి. చాలా కాలం తరువాత ఫ్యామిలీతో కలిసి హాయిగా నవ్వుకునే సినిమాగా ఇది మార్కులు కొట్టేస్తుందని చెప్పచ్చు .



## వార్ వన్ సైడ్..
## 8.4 ఓవర్లలోనే భారత్ విక్టరీ!




భారత మహిళల జట్టు పాకిస్థాన్‌పై సూపర్ విక్టరీ నమోదు చేసింది. దాయాది పోరులో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా భారత జట్టు అదరగొట్టింది. తొలుత బౌలర్ల విజృంభణతో పాకిస్థాన్‌ను కేవలం 55 పరుగులకే కట్టడి చేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. అనంతరం 8.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో మరోసారి భారత్-పాక్ మ్యాచ్‌లో ఏకపక్ష ఆధిపత్యం కనిపించింది.టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్‌కు ఆరంభంలో మునీబా అలీ, షవాల్ జుల్ఫికర్ మంచి ఆరంభం అందించారు. తొలి నాలుగు ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 23 పరుగులు చేశారు. అయితే షఫాలీ వర్మ బౌలింగ్‌కు రావడంతో పాక్ పతనం మొదలైంది. ఐదో ఓవర్‌లో మునీబా అలీని బౌల్డ్ చేసిన షఫాలీ భారత్‌కు తొలి బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత శ్రీ చరణి వరుస దెబ్బలు కొట్టడంతో పాక్ పవర్‌ప్లే ముగిసేసరికి 29 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది.అక్కడి నుంచి పాకిస్థాన్ బ్యాటింగ్ పూర్తిగా కుప్పకూలింది. చరణి మరో వికెట్ తీయగా, ప్రేమా రౌత్ తన స్పిన్‌తో పాక్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టింది. దీప్తి శర్మ కూడా కీలక వికెట్లు పడగొట్టింది. తొమ్మిది ఓవర్లు పూర్తయ్యేసరికి పాకిస్థాన్ 35 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. పరుగులు రాబట్టడంలో విఫలమైన పాక్ బ్యాటర్లు చెత్త షాట్లతో వరుసగా పెవిలియన్ చేరారు.మరోవైపు భారత ఫీల్డర్లు కూడా చురుగ్గా వ్యవహరించారు. ఈమాన్ ఫాతిమా రనౌట్ కావడంతో పాక్ కష్టాలు మరింత పెరిగాయి. ప్రేమా రౌత్ ఉమ్మె హానీ, నష్రా సాంధూలను ఔట్ చేసి మూడు వికెట్ల ఘనత సాధించింది. చివర్లో టుబా హసన్‌ను దీప్తి శర్మ స్టంపౌట్ చేయడంతో 18.1 ఓవర్లలో పాకిస్థాన్ 55 పరుగులకు ఆలౌటైంది. భారత్ బౌలర్లలో శ్రీ చరణి 3/7, ప్రేమా రౌత్ 3/9, దీప్తి శర్మ 2/5తో అదరగొట్టారు.స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు కూడా ఆరంభంలో స్వల్ప ఎదురుదెబ్బ తగిలింది. ఫాతిమా సనా మూడు వికెట్లు తీసి మ్యాచ్‌లో ఉత్కంఠ రేపేందుకు ప్రయత్నించింది. అయితే లక్ష్యం చాలా చిన్నది కావడంతో భారత జట్టు పెద్దగా ఇబ్బంది పడలేదు. కేవలం 8.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి ఏడు వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. 68 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించడం భారత ఆధిపత్యానికి అద్దం పట్టింది.

### పాక్‌పై మరోసారి టీమిండియా జోరు..

ఈసారి పోరు పూర్తిగా ఏకపక్షంగా సాగింది. ఆరంభం నుంచి చివరి వరకు భారత మహిళల జట్టుదే ఆధిపత్యం. పాకిస్థాన్‌కు ఏ దశలోనూ కోలుకునే అవకాశం ఇవ్వకుండా టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. టీ20ల్లో ఇరు జట్ల మధ్య ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌ల్లో భారత్ 15 విజయాలతో స్పష్టమైన పైచేయి సాధించగా.. పాకిస్థాన్ ఖాతాలో కేవలం 3 విజయాలే ఉన్నాయి. తాజా మ్యాచ్‌లోనూ భారత్ అదే ఆధిపత్యాన్ని కొనసాగించి పాక్‌కు మరోసారి షాకిచ్చింది.



## టెస్టుల్లో లాగా చెలరేగాలంటే..
## పంత్‌కు రైనా కీలక సలహా

టీమిండియా వికెట్ కీపర్-బ్యాటర్ రిషభ్ పంత్ టెస్టు క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్నప్పటికీ, పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో మాత్రం అదే స్థాయి ప్రదర్శన చేయలేకపోతున్నాడు. దీనిపై భారత మాజీ బ్యాటర్ సురేశ్ రైనా స్పందించాడు. పంత్‌లో అపారమైన ప్రతిభ ఉందని, మానసిక అడ్డంకులను అధిగమించి, ఎలాంటి సంకోచం లేకుండా ఆడితే వైట్ బాల్ క్రికెట్‌లోనూ టెస్టు ఫామ్‌ను పునరావృతం చేయగలడని రైనా విశ్వాసం వ్యక్తం చేశాడు.టెస్టుల్లో మ్యాచ్ విన్నర్‌గా పేరు తెచ్చుకున్నప్పటికీ, పంత్ వన్డేలు, టీ20ల్లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోలేకపోయాడు. అతను ఇప్పటివరకు 31 వన్డేలు, 76 టీ20లు ఆడాడు. చివరిసారిగా 2024లో భారత జట్టు తరఫున వైట్ బాల్ మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత 2025 ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన జట్టులో ఉన్నా, తుది జట్టులో అవకాశం రాలేదు. ఈ ఏడాది జూన్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన సిరీస్‌కు వన్డే జట్టు నుంచి కూడా అతడిని తప్పించారు.ఆకాశ్ చోప్రా యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ రైనా ఈ వ్యాఖ్యలు చేశాడు. "పంత్ నా ఫేవరెట్ ప్లేయర్. అతను టెస్టుల్లో అద్భుతంగా ఆడుతూ భారీ స్కోర్లు చేస్తున్నాడు. జట్టులో ధ్రువ్ జురెల్, సంజూ శాంసన్ వంటి వారు ఉన్నా, పంత్‌లో ఒక ప్రత్యేకమైన ఎక్స్-ఫ్యాక్టర్ ఉంది. అతను నెమ్మదిగా పరిణతి చెందుతున్నాడు" అని రైనా పేర్కొన్నాడు.అయితే టెస్టుల్లో రాణించినట్లుగా వన్డే, టీ20ల్లో ఎందుకు రాణించలేకపోతున్నాడనేది ప్రశ్నార్థకమని రైనా అన్నాడు. "అతని మదిలో ఏదైనా ఆలోచన ఉందా? అదేంటో అతను తెలుసుకోవాలి. టెస్టుల్లో అయితే ఎలాంటి సంకోచం లేకుండా తొలి బంతికే సిక్స్ కొట్టడానికి కూడా వెనుకాడడు. కానీ వైట్ బాల్ క్రికెట్‌లో ఇన్నింగ్స్‌ను ఎలా నడిపించాలో అతను ఆలోచించుకోవాలి" అని రైనా విశ్లేషించాడు. "కొన్నిసార్లు ఆటగాడికి ఒకరకమైన మానసిక అడ్డంకి ఏర్పడుతుంది. దాన్ని అధిగమించడానికి సరైన మార్గనిర్దేశం చేసే వారితో సమయం గడపాలి. పంత్ తన సహజ శైలిలో స్వేచ్ఛగా ఆడాలి. అతను ఎంతో సాధించగలడు. గతంలో అతను ఎదుర్కొన్న గడ్డు పరిస్థితుల (యాక్సిడెంట్) దృష్ట్యా, దేవుడి దయతో భవిష్యత్తులో తప్పకుండా రాణిస్తాడు. అతని సమయం వస్తుంది" అని రైనా ఆశాభావం వ్యక్తం చేశాడు.

## రాష్ట్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు



**రాయచోటి-సూర్య వాస్తవం:**నియోజకవర్గ కేంద్రమైన రాయచోటికి విచ్చేసిన జిల్లా ఇన్చార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిలను రాయచోటి జనసేన పార్టీ నాయకులు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్, దర్బార్ భాష, యహీయా భాష, జిలాన్ భాష, అష్రఫ్,హబీబ్ లు ఆదివారం రాయచోటి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం రాయచోటి నియోజకవర్గం లో ఉన్న సమస్యల పైన చర్చించడం జరిగింది. అదే విధంగా ఎలక్ట్రిసిటీ శాఖ మంత్రి రాయచోటిలో కరెంటు అంతరాయం లేకుండా చూడాలని, విజ్ఞప్తి చేశారు. రాజంపేట రోడ్డు షికారు పాలెం నుండి సానిపాయ వరకు రోడ్డు పూర్తిగా అధ్వానంగా ఉందని, త్వరగా కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రయాణికు లందరికి ప్రయాణించే సౌకర్యం కల్పించాలని జన సైనికులు ఆర్ అండ్ బి మంత్రికి కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## మంత్రులకు స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ఎస్పీలు

**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా! 'ప్రజా చేరువ' కార్యక్రమంలో భాగంగా... శనివారం ఉదయం రాయచోటి స్టేట్ గెస్ట్ హౌస్‌కి విచ్చేసిన రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడల శాఖ మంత్రి, జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి





, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కి ఆత్మీయ స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, అధికారులు. ఈ సందర్భంగా స్టేట్ గెస్ట్ హౌస్ లో జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ, ఇతర అధికారులతో కొద్దిసేపు సమావేశమై జిల్లా అభివృద్ధి గురించి చర్చించిన మంత్రుల బృందం.

## ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా మారని మా తల రాతలు

**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం :**ఎన్ని ప్రభుత్వాలు మారినా మా తలరాతలు మాత్రం మారలేదంటూ కడప జిల్లా వీరబల్లి మండలం వీరబల్లిలోని ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది అంటున్నారు. కొంతకాలంగా తమ బతుకులు కాంట్రాక్టు కే పరిమితం అయ్యాయని వారు పోయారు. శనివారం వైద్యశాల ఎదుట వాళ్ళు నిరసన చేపడుతూ ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే తమను పర్మనెంట్ చేయాలని అదేవిధంగా ఉద్యోగులు లాగానే తమను కూడా రెగ్యులర్ చేస్తూ అన్ని బెనిఫిట్‌లు కల్పించాలన్నారు100% గ్రాస్‌తో పాటు పిఎఫ్ సౌకర్యం కూడా కల్పించాలన్నారు. చాలా కాలం నుంచి పనిచేస్తున్న తమకు కనీసం రిక్వెస్ట్ కింద మ్యూచువల్ ట్రాన్స్ఫర్ అయిన జరిపించాలన్నారు. విధుల్లో ఉండి మరణించిన వారి కుటుంబానికి ఒక ఉద్యోగంతో పాటు రూ.50 లక్షలు ఎక్స్గ్రేషియా కూడా చెల్లించాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో హసీనా స్టాఫ్ నర్స్,వెంకట కృష్ణయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.




# అభివృద్ధి, స్థానిక ఎన్నికలపై మంత్రుల కీలక సమీక్ష

**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం:**రాయచోటి స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధికారులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల కల్పన, విద్యుత్, రహదారులు, తాగునీరు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న మంత్రులు, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను గుర్తించి, వాటికి సత్వర పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. "అభివృద్ధి ఆగకూడదు.. ప్రజా సంక్షేమం ఆగకూడదు.. రాయచోటి ప్రగతి పరుగులు తీయాలి" అనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రులు స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు





అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేసి, రాయచోటి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అలాగే రానున్న మున్సిపాలిటీ, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఎలా ముందుకు సాగాలి, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డు స్థాయిలో కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తూ అభివృద్ధిని ఒక వైపు.. సంక్షేమాన్ని మరో వైపు.. ప్రజా సేవను ప్రధాన అజెండాగా చేసుకుని కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రులు పేర్కొన్నారు. రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాయచోటి అభివృద్ధే లక్ష్యం.. ప్రజల సంక్షేమమే ధ్యేయం.. కూటమి ఐక్యతే బలం అనే సంకల్పంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మంత్రుల ఆధ్వర్యంలో కీలక నిర్ణయాలు, కార్యాచరణపై చర్చ జరిగింది.



# దొరవారిసత్రంలో ఓటర్ల ప్రత్యేక సవరణ డ్రైవ్

### - అదనపు ఏఈఆర్వో తనిఖీ
### -మోదుగులపాలెంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ ఓటర్ల గురింపుపై గ్రామసభ
### -పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అదనపు ఏఈఆర్వో,తహసీల్దార్ రాజేంద్ర

**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** దొరవారిసత్రం మండల వ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం అత్యంత వేగంగా సాగుతోంది. తహసీల్దార్ రాజేంద్ర పర్యవేక్షణలో శనివారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు,రెవెన్యూ అధికారులు





ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మండల పరిధిలోని మోదుగులపాలెం గ్రామ పంచాయతీలో ఎస్సీ,ఎస్టీ మరియు బీసీ ఓటర్ల గుర్తింపు ప్రక్రియపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ నంబర్ 193 మోదుగులపాలెం పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్ల జాబితాలో చేర్చేలా,నకిలీ మరియు తప్పుల తడకలుగా ఉన్న పేర్లను సవరించేలా గ్రామస్తుల సమక్షంలో సభను పూర్తి చేశారు. ఓటర్ల ప్రత్యేక ప్రచారం రోజును పురస్కరించుకుని నియోజకవర్గ అదనపు ఏఈఆర్వో దొరవారిసత్రం మండలంలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. పోలింగ్ స్టేషన్ నంబర్ 177 పొలిరెడ్డిపాలెం ను తహసీల్దార్ రాజేంద్రతో కలిసి సందర్శించారు. అక్కడ బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఓటర్ నమోదు ఫారాలు,సవరణ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్దేశిత గడువులోగా అర్హులైన యువతీ యువకులు ఓటర్లుగా నమోదయ్యేలా చొరవ చూపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలోఎంపీడీవో గోవర్ధన్, రెవెన్యూ సిబ్బంది,బీఎల్ఓలు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మాజీ పంచాయతీ సెక్రెటరీ జయరామ నాయుడు మృతి



**బ్రహ్మంగారిమఠం-సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని కొత్తూరు గ్రామానికి చెందిన తిప్పన సుబ్బరాయుడు (రిటైర్డ్ టీచర్) వారి పెద్ద కుమారుడు తిప్పన జయరామ నాయుడు (రిటైర్డ్ పంచాయతీ సెక్రెటరీ) శనివారం గుండెపోటుతో మరణించాడు. ఆయన మరణం పట్ల శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి సంతాపం తెలియజేశారు. అలాగే వీరి తమ్ముడు దత్తాత్రేయ స్వామి మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక మండల తెలుగుదేశం నాయకులు ఎస్సార్ శ్రీనివాసులు రెడ్డి, ముడుమాల పోలి రెడ్డి ,స్థానిక ఎంపీడీవో రామచంద్రారెడ్డి, పరిపాలనాధికారి నరసయ్య, ఉపాధి హామీ మండల అధికారి హరికృష్ణ,స్థానిక పంచాయతీ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, అలాగే స్థానికులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

## ఆదర్శ విద్యా నికేతన్ పాఠశాలలో మిన్నంటిన టీచర్స్ డే సంబరాలు



**పెద్దవడుగూరు - సూర్య వాస్తవం:** పెద్దవడుగూరు ఆదర్శ విద్యా నికేతన్ ఆవరణలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. భారత మాజీ రాష్ట్రపతి గొప్ప విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు ఉపాధ్యాయ బృందం కలిసి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ కరణం నారాయణరావు జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో అజ్ఞానమనే చీకట్లను తొలగించి జ్ఞాన దీపాలను వెలిగించే శక్తి ఒక్క ఉపాధ్యాయుడికే ఉందని కొనియాడారు. విద్యార్థులను క్రమశిక్షణ గల ఉత్తమ పౌరులుగా మార్చడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని, ఆదర్శ విద్యా నికేతన్ ఉపాధ్యాయ బృందం అందిస్తున్న విద్యా సేవలు ఎంతో అభినందనీయమని ఆయన స్పష్టం చేశారు. వేడుకల్లో భాగంగా పాఠశాల సీనియర్ విద్యార్థులు ఉపాధ్యాయుల దుస్తులు ధరించి ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారి చిన్న తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు మరియు గురువుల గొప్పత నాన్ని చాటే నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తమకు విద్యాబుద్ధులు నేర్పుతున్న గురువులకు విద్యార్థులు ప్రత్యేక గ్రీటింగ్ కార్డులు, పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక గురువందనం సమర్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కరణం నారాయణరావు చేతుల మీదుగా ఉపాధ్యాయులందరినీ శాలువాలు జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు విద్యాబోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 .

# ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా గురుపూజోత్సవ కార్యక్రమం...!

## - ఉపాధ్యాయులకు అసలైన గౌరవం తీసుకొచ్చింది నారా లోకేష్, ఎమ్మెల్యే దగ్గుపాటి
## - గురుపూజోత్సవంలో 67 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** గత ఐదేళ్లలో అవమానాలకు గురైన ఉపాధ్యాయులకు తిరిగి గౌరవం, గుర్తింపు తీసుకొచ్చిన వ్యక్తి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు, ఎస్సీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప, లేబర్ కమిషన్ ఛైర్మన్ రమేష్ నాయుడు, ఆర్జేడీ, డీఈఓ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 67 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా పనిచేసిన చరిత్ర ఉన్న ఆర్ట్స్ కళాశాలలో గురుపూజోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తల్లిదండ్రుల తర్వాత సమాజంలో అత్యంత గౌరవం పొందేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. ఐఏఎస్ అధికారి నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి వరకు, రాజకీయ నాయకుడి నుంచి సామాన్య విద్యార్థి వరకు ప్రతి ఒక్కరి జీవితంలో ఉపాధ్యాయుడి పాత్ర ఉంటుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులకు గౌరవం లేకుండా పోయిందని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయులకు సముచిత గౌరవం, గుర్తింపు కల్పించడంతో పాటు విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని తెలిపారు. టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య అనుసంధానం పెంచేందుకు మెగా పీటీఎంలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలను 148 రోజుల్లో భర్తీ చేశామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ ప్రోత్సాహంతో ఉపాధ్యాయులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని, ఫలితంగా గత ఏడాది కాలంలో అనంతపురం జిల్లాలో దాదాపు 4 వేల మంది విద్యార్థులు ప్రైవేటు విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని ఎమ్మెల్యే వెల్లడించారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో గత 30 ఏళ్లుగా కొన్ని పాఠశాలలు కేవలం ఏడో తరగతి వరకు మాత్రమే కొనసాగుతున్నాయని, మంత్రి నారా లోకేష్ సహకారంతో వాటిని అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. దీంతో అదనంగా దాదాపు 84 మంది ఉపాధ్యాయులు అందుబాటులోకి వచ్చారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**బెలుగుప్ప - సూర్య వాస్తవం:** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవం సందర్భంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బెలుగుప్ప నందు వినూత్నంగా విద్యార్థులె ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐశ్వర్య పదవ తరగతి విద్యార్థిని వ్యాఖ్యాతగా సభా వేదికపైకి సభాధ్యక్షునిగా శ్రీ వెంకట ప్రసాద్ ప్రధానోపాధ్యాయుల వారిని ఆహ్వానించి తర్వాత పాఠశాల సిబ్బందిని వేదికపైకి ఆహ్వానించారు. తరువాత ప్రార్థన, శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి చిత్రపటానికి పూలమాల, పూజా కార్యక్రమంతో ఈ కార్యక్రమం ప్రారంభించారు. తర్వాత ఐశ్వర్య మాట్లాడుతూ శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలు వారు విద్యార్థులకు చేసిన సేవలు ఈ సందర్భంగా కొనియాడి నేటి యువత సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ఆదర్శంగా తీసు కోవాలని తల్లితండ్రుల తరువాత గురువు స్థానం గొప్పదని గురువులు బోధించిన మంచి విషయాలను తుచా తప్పకుండా పాటించి నవ సమాజం నిర్మాణంతో పాటు దేశానికి, రాష్ట్రానికి, పాఠశాలకు,కుటుంబానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొని వస్తామని ప్రతిజ్ఞ చేస్తామని ఐశ్వర్య తెలియజేసింది. తరువాత ఉపాధ్యాయుల గొప్పతనాన్ని పాటలు, కవితలు, ప్రసంగం రూపంలో తెలుగు, హిందీ,ఇంగ్లీషు లలో అనర్గళంగా ఉషశ్రీ 10వ, అలియా 6వ,వెన్నెల 8వ, షాజియా కోషెర్ 7వ, పల్లవి 7వ, ఉల్లాస్ 8వ, వరుణ్ తేజ 6వ లు ఉపాధ్యాయుల గొప్పతనాన్ని తమ భావ వ్యక్తీకరణ ద్వారా వ్యకతపరిచారు. చివరిగా సభాధ్యక్షుల శ్రీ వెంకట ప్రసాద్ గారు మాట్లాడుతూ సమాజంలో గురువు స్థానం గొప్పదని గురువులు చెప్పిన విషయాలను మీరు తుచాతప్పకుండా పాటిస్తే విద్యార్థులు గొప్ప స్థానానికి ఎదుగుతారని గురువు ఎప్పుడూ శిష్యుల ఎదుగుదల కోసం తన విజ్ఞానాన్ని దారబోసి విద్యార్థుల ఎదుగుదలకు తోడ్పడి తను మాత్రం అలాగే గురువు స్థానంలోనే ఉంటాడు. అదే గురువు యొక్క గొప్పతనమని ఈ సందర్భంగా విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులందరు గురుపూజోత్సవం సందర్భంగా గురువు గొప్పతనాన్ని తెలుసుకొని నేటి విద్యార్థులందరు నవసమాజ నిర్మాణం కోసం పాటుపడాలని తెలియజేశారు. ఈ సందర్భంగా సీనియర్ టీచర్ నాగరాజు తెలుగు పండిట్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యమంలో ఉపాధ్యాయులు సరిత, గోవిందరెడ్డి,సజీవకుమార్, జయలక్ష్మి, స్వర్ణలత, రమణమూర్తి, గోపాల్ రెడ్డి పిడి తదితరులు పాల్గొన్నారు.



**పామిడి శ్రీ చైతన్య స్కూల్‌లో...** ఉపాధ్యాయ దినోత్సవన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులందరికీ శాలువాతో సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో భాగంగా పాఠశాల సీఈఓ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన మహోన్నతుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతదేశానికి మొదటిఉపరాష్ట్రపతి గాను రెండవ రాష్ట్రపతిగా భారతీయ రాజకీయవేత్త తత్వవేత్త, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ సేవలందించారాని తెలిపారు. 1954లో మానవ సమాజానికి రాధాకృష్ణన్ చేసిన కృషికి భారతదేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన భారతరత్న బిరుదును పొందిన విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని విద్యార్థులకు తెలియజేశారు. నేటి బాలలే రేపటి పౌరులు కనుక ప్రతి విద్యార్థి జీవితం వికసించిన పుష్పం వంటిదని బాల్యంలో సమయం వృధా చేయకుండా లక్ష్య సాధన తోనే శ్రమిస్తూ ప్రగతికి బాటలు వేయాలని సూచించారు. డైరెక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ బోధనతో పాటు జీవన విలువలను బోధిస్తూ మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తారని విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలిచి జ్ఞానాన్ని పంచుతూ నిస్వార్థంగా వారి భవిష్యత్తును నిర్మించే ఉపాధ్యాయులను గౌరవించడానికి మన దేశంలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటామని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ వారే అనుభవాలను మాటలు, కవితలు విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయుల చేత కేక్ కట్ చేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ 138వ జయంతి, మదర్ థెరిసా 29వ వర్ధంతి కార్యక్రమం



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో ప్రెసిడెంట్ అబూబాకర్, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతి,మద ర్ థెరిసా 29వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వ హించారు. కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, జాయింట్ సెక్రటరీ విజయ లక్ష్మి సర్వేపల్లి రా ధాకృష్ణన్ ,మదర్ థెరిసా చిత్ర పటా లకు పూల మాల వేసి నివాళులర్పించారు. వ్యక్తలు మాట్లాడుతూ స ర్వేపల్లి రాధాకృష్ణన్ 1962 నుండి 1967 వరకు భారత దేశానికి రెండ వ రాష్ట్రపతిగా పని చేసిన భారతీ య రాజకీయ వేత్త.తత్వ వేత్త,రాజ నీతిజ్ఞుడు. గతంలో 1952నుండి 19 62వరకు భారత దేశానికి మొదటి ఉప రాష్ట్రపతిగా పని చేశారు. వీరి కి భారత రత్న టెంపుల్ టన్ పుర స్కారం ఇచ్చారు. మదర్ థెరిసా ద రిద్రంలో మగ్గుతున్న వారికి దారి చూపుతుంది. ఆకలితో అలాంటిస్తు న్న వారికి ఆహారం అందిస్తుంది. రో గములతో ఉన్న వారికి మందులి స్తుంది. ఈమెకు గుండె శస్త్ర చికిత్స జరిగింది కాని అమెకు ఆరోగ్యం క్షీ ణిస్తోంది. ఆమె 1997లో సెప్టెంబర్ 5వ తేదీన అనారోగ్యంతో మరణి స్తుంది అని కోశాధికారి జెన్నే కుల్లా యిబాబు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ప్రెసిడెంట్ అబూబాకర్,కో శాధికారి జెన్నే కుల్లాయిబాబు,సె క్రెటరీ రామ్ మోహన్, విజయ లక్ష్మి, లక్ష్మి నారాయణ రెడ్డి, షైక్షా వలి, నారాయణరెడ్డి హస్సన్ అహమ్మద్, మద్దులేటి, దేవదాస్, నారాయణ శెట్టి, గోవిందప్ప, నరసింహులు, ఓబులేసు, దామోదర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం..!

### - విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలి
### - విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ నేర్పాలి
### - గురుపూజోత్సవంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ




**అనంతపురం విద్య - సూర్య వాస్తవం :** ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు చిరస్మరణీయమని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యతను నేర్పి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతపురం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్) కళాశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం (గురు పూజోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 4 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం శుభ పరిణామమన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి సరైన మార్గనిర్దేశం చేస్తూ, వారి ప్రతిభను వెలికితీసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యారంగంలో సమిష్టి కృషితో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఎంపీ పేర్కొన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే విద్యారంగంలో అగ్రస్థానంలో నిలిపేందుకు విద్యాశాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన భోజనంతో పాటు 'తల్లికి వందనం' వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి పురస్కారాలను అందజేశారు. విద్యారంగానికి వారు అందిస్తున్న విశిష్ట సేవలను అభినందిస్తూ పురస్కార గ్రహీతలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎస్టీ కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, విద్యాశాఖ ఆర్జేడీ శామ్యూల్, డిఇఓ అయూబ్ హుస్సేన్, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు తపాలా సహకార సంఘం సర్వసభ్య సమావేశం...!

### - తప్పనిసరిగా హాజరుకావాలని అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి పిలుపు

**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం డివిజన్ తపాలా సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి, కార్యదర్శి మహేష్ గౌడ్ శనివారం తెలిపారు. సమావేశంలో సంఘానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై చర్చించడంతో పాటు సభ్యుల అభిప్రాయాలు, సలహాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని సంఘం సభ్యులందరూ తప్పనిసరిగా సమావేశానికి హాజరై తమ విలువైన సూచనలు అందించి సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## ఎస్కేయూలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు...!

### - ఎస్కేయూ విద్యార్థుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహం
### - క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రధానం చేసిన ఆదినారాయణ యాదవ్

**అనంతపురం విద్య - సూర్య వాస్తవం :** అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గొడ్డుమర్రి ఆది నారాయణ యాదవ్ పాల్గొని శ్రీకృష్ణ పరమాత్మను దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మాన్ని కాపాడుతూ సమాజానికి సత్యం, న్యాయం, మానవతా విలువలను బోధించిన శ్రీకృష్ణ పరమాత్మ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. జన్మాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేత, రన్నరప్ జట్లకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విజయం సాధించిన క్రీడాకారులను అభినందిస్తూ, పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న ప్రతి



ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, టీమ్ స్పిరిట్, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. శ్రీకృష్ణుని సందేశం యువతకు ధైర్యం, ధర్మం, కర్తవ్యనిష్ఠకు మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. శ్రీకృష్ణుని ఆశీస్సులతో విద్యార్థులు విద్య, క్రీడలు, సేవా రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జ్యోతి కుమార్, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, రమేష్ గౌడ్, 'ఫర్ ది సొసైటీ' వ్యవస్థాపకులు రాధాకృష్ణ, ప్రొఫెసర్ సత్యనారాయణ, బెస్తరపల్లి కృష్ణమూర్తి, హైకోర్టు రమణ యాదవ్, ఆశ్వర్త యాదవ్,నారాయణస్వామి యాదవ్, ఎమ్మార్వో మారుతి, జయపాల్ యాదవ్, సురేష్, నవీన్, పవన్ తదితరులు పాల్గొన్నారు. వందలాది మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని శ్రీకృష్ణ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

## ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకుంటున్న కె. వెంకటరమణయ్య

### -ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న మంత్రి ఫారుక్ , జిల్లా కలెక్టర్



**నంద్యాల- సూర్య వాస్తవం :** నంద్యాల జిల్లా కలెక్టరేట్లో ఉపాధ్యాయ దినాన్ని పురస్కరించుకొని పగిడ్యాల మండలంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో పి జి టి -- జువాలజీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కోలాల పరమేశ్వరుడు--లక్ష్మీదేవి దంపతుల కుమారుడు వెంకట రమణయ్య నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం ఎన్. రంగాపురం గ్రామానికి చెందిన రమణయ్య విద్యాభ్యాసం పై ఉన్న మక్కువతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన డా. కోలాల వెంకట రమణయ్య తన అంకితభావం, నిరంతర కృషి ఉత్తమ బోధనా పద్ధతులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థుల విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం, వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, ఉన్నత విద్యావకాశాల వైపు ప్రోత్సహించడం వంటి కార్యక్రమాల్లో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన నంద్యాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం 2026కు ఆయన ఎంపికయ్యారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంత్రి ఫారుక్ జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి చేతుల మీదుగా అందుకోనున్నారు.